ఉష్ణోగ్రత వివరాలు

కేంద్రం	గరిష్ఠం	కనిష్ఠం
నెల్లూరు	36.3	23.4
కావలి	35	28
ఆత్మకూరు	36	27
ఉదయగిరి	37	26
కందుకూరు	36	28

కేటాయింపులు సరే.. నీరు పారేదెలా ?

- ఇప్పటికే పంట కాలువల్లో తొలగని పూడిక
- లస్కర్ల నియామకానికి రాని అనుమతులు
- ప్రజాప్రతినిధుల జోక్యం ఎంతో అవసరం
- నేడు ఐఏబీ సమావేశం



గుర్రపుడెక్కతో నిండిన ఇందుకూరుపేట మండలం గంగపట్నంలోని ప్రధాన కాలువ

నెల్లూరు, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): రికార్డు స్థాయి విస్తీర్ణంలో జిల్లాలో రెండో పంట సాగు చేసుకునేందుకు అవకాశం లభించింది. ప్రాజెక్టుల్లో ఉన్న నీటితో ఐదు లక్షల ఎకరాలకుపైగా ఆయకట్టుకు నీటి కేటాయింపులు జరిపేందుకు గురువారం (నేడు) సాగునీటి సలహా మండలి(ఐఏబీ) సమావేశం నిర్వహించనున్నారు. ఏ కాలువ కింద ఎంత ఆయకట్టు వరకూ సాగుకు నీరివ్వాలన్నది ఈ సమావేశంలో తీర్మానిస్తారు. మే 1 నుంచి రెండో పంటకు నీటి విడుదల ప్రారంభించనున్నారు. ఇప్పటికే రైతాంగం దుక్కులు సిద్ధం చేసుకుంటోంది. అయితే ఇప్పటికీ పంట కాలువలు అభివృద్ధికి నోచుకోలేదు. మొదటి పంట పూర్తి ఆయకట్టులో సాగు జరగడంతో అన్ని కాలువలు పూడిక, గుర్రపు డెక్కతో నిండిఉన్నాయి. నీరు సక్రమంగా పారని విధంగా రూపుకోల్పోయాయి. ఈ కాలువలను బాగు చేసేందుకు ఇంత వరకూ ఎలాంఇ చర్యలు చేపట్టలేదు.

ప్రతిపాదనలకు రాని అనుమతులు

జిల్లా వ్యాప్తంగా కాలువలు, చెరువులు, తూములు, షట్టర్లను బాగు చేసేందుకు ఇరిగేషన్ అధికారులు రూ.144 కోట్లతో ఓఅండ్ఎం పనులకు ప్రతిపాదనలు పంపారు. ఇది జరిగి కూడా నెల దాటింది. కానీ ఇంతవరకూ ప్రభుత్వం నుంచి అనుమతులు లభించలేదు. ఎందుకు ఇంత ఆలస్యం చేస్తున్నారో అర్థంకాని పరిస్థితి. జిల్లా నుంచి వెళ్లిన ప్రతిపాదనలన్నింటికీ ఆమోదం ఇవ్వకపోయినా కనీసం కాలువల్లో నీరు సాఫీగా పారేందుకు పూడికతీతకైనా అనుమతులు ఇవ్వాల్సి ఉండగా, ఇరిగేషన్ అధికారులు ఆ దిశగా కూడా ఆలోచన చేయడం లేదు. ఇప్పటికిప్పుడు అనుమతులు ఇస్తే గానీ నీటి విడుదల చేసే నాటికి కాలువలను బాగు చేయడం సాధ్యపడదు. ప్రస్తుతం వేసవి సీజన్ కావడంతో ఆవిరిశాతం కూడా ఎక్కువగా ఉంటుంది. ఈ సమయంలో కాలువలు శుభ్రంగా లేకపోతే చివరి ఆయకట్టు వరకూ సక్రమంగా నీరందించడం సాధ్యపడదని రైతులు ఆందోళన చెందుతున్నారు.

లస్కర్ల నియామకం మరిచారా..?

సాగునీటి రంగంలో లస్కర్లు కీలకంగా వ్యవహరిస్తుంటారు. నీరు వృథా కాకుండా ప్రతీ ఎకరాకు సక్రమంగా అందేలా చేయడంలో వీరిది ప్రధాన పాత్ర. గత మూడేళ్లుగా వీరు లేకపోవడంతో రైతులే అవస్థలు పడుతూ కాలువలపై చెక్కలు, షట్టర్లు ఎత్తుకోవడం, దించుకోవడం చేయాల్సి వస్తోంది. దీంతో నీరు వృథా అవుతోంది. కొన్ని చోట్ల రైతుల మధ్య నీటి పంపకాల విషయంలో వివాదాలు తలెత్తుతున్నాయి. ప్రస్తుతం కాలువల కింద నిర్దేశిత ఆయకట్టు వరకే నీరు ఇవ్వనున్నారు. అంతకు మించి ఆయకట్టులో సాగు చేస్తే పంట చివరి దశలో సాగునీటి ఇబ్బందులు తలెత్తుతాయి. ఆ సమయంలో అనధికార ఆయకట్టులో సాగు చేయకుండా అడ్డుకోవడమే కాకుండా అక్కడకు నీరు ఇవ్వకుండా చూడాల్సిన బాధ్యత కూడా అధికార యంత్రాంగంపై ఉంటుంది. క్షేత్రస్థాయిలో ఈ పనిని లస్కర్లే చేయాల్సి ఉంది. కానీ ఈ లస్కర్ల నియామకం గురించి ఎవరూ పట్టించుకోవడం లేదు. ఉన్న లస్కర్లను వైసీపీ ప్రభుత్వంలో వేతనాలు కూడా చెల్లించకుండా అర్థంతరంగా తొలగించారు. ప్రస్తుతం ఎమ్మెల్యేలుగా ఉన్న కొందరు నాడు ప్రతిపక్షంలో ఈ లస్కర్ల తరఫున పోరాడారు. అయితే ఇప్పుడు అధికారంలోకి వచ్చాక మాత్రం లస్కర్ల నియామకంలో చొరవ తీసుకోవడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. జిల్లా నుంచి ఇరిగేషన్ అధికారులు ప్రతిపాదనలు పంపుతున్నా రాష్ట్రస్థాయిలో అనుమతులు లభించడం లేదని అధికారులు చెబుతుండడం గమనార్హం. ఏటా ఇరిగేషన్ వర్కుల కోసం రూ.వేల కోట్లు ఖర్చు చేస్తుండగా, రూ.2 కోట్లు వేతనాలు ఇచ్చి లస్కర్లను నియమించలేకపోతున్నారు.

ఎన్ఎంసీ కమిషనర్ బదిలీ

- ఏడాది కాకముందే స్థానచలనం
- వివాదాస్పదంగా సూర్యతేజ నిర్ణయాలు
- రాజకీయ కారణాలుండవచ్చని చర్చ

నెల్లూరు(సిటీ), ఏప్రిల్ 16, (ఆంధ్రజ్యోతి): నెల్లూరు నగర పాలక సంస్థ (ఎన్ఎంసీ) కమిషనర్ మల్లవరపు సూర్యతేజ బదిలీ అయ్యారు. ఏపీ టెక్నాలజీ సర్వీసెస్ ఎండీగా ఆయన్ను నియమిస్తూ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కే. విజయానంద్ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. అయితే ఈ బదిలీ వెనుక రాజకీయ కారణాలు ఉండవచ్చనే చర్చ కార్పొరేషన్ వర్గాల్లో సాగుతోంది.

ఏడాది కాకముందే...




గత జూలై 7న ఎన్ఎంసీ కమిషనర్గా సూర్యతేజ బాధ్యతలు చేపట్టారు. ఏడాది కాకముందే ఆయన బదిలీ కావడం చర్చనీయాం శమైంది. గత 9 నెలల కాలంలో ఆయన తీసుకున్న పలు నిర్ణ యాలు వివాదస్పదమయ్యాయి. కార్పొరేషన్లోని రెవెన్యూ విభాగంలో ఆర్వో, ఆర్ఐలను మూకుమ్మడిగా బదిలీ చేసిన ఆయన, 10 మంది ఆర్ఐల పరిధిని ఆరుకు కుదించారు. ఇద్దరు ఆర్వోల పరిధిని ఒకరికి మాత్రమే కట్టబెట్టారు.ఈ వ్యవహారం ఇటు ఉద్యోగులు, అటు రాజకీయ నాయకుల ఆగ్రహానికి గురైంది. అంతేకాక ఎలాంటి అనుభవం లేని కొందరు ఉద్యోగులను అందలం ఎక్కించారు. ఎక్కడాలేని విధంగా రెవెన్యూ అధికారులతో శానిటేషన్ విధులు నిర్వర్తింపజేశారు. మేయర్తోనూ సఖ్యత సాగించలేకపోయారు. అభివృద్ధి పనులు చేసిన కాంట్రాక్టర్లకు బిల్లుల చెల్లింపులు ఆపేయడంతోపాటు, మంజూరుకు సిద్ధంగా ఉన్న బిల్లులను వెనక్కు పంపి, కాంట్రాక్టర్లలో గందరగోళాన్ని నింపారు. ప్రజాప్రతినిధులతో సమన్వయం లేకుండా, ఏకపక్షంగా నిర్ణయాలు తీసుకున్నారని కొంతమంది అధికార పార్టీ నేతలు రాజధాని స్థాయిలో ఆయనపై ఫిర్యాదులు చేశారు. ఈ క్రమంలో బదిలీ అంశం చర్చనీయాంశమైంది.

కొత్త కమిషనర్ ఎవరు?

సూర్యతేజ స్థానంలో ఎవరు వస్తారనేది ఉత్కంఠగా మారింది. మళ్లీ ఐఏఎస్ స్థాయి అధికారే వస్తారా...? లేదా నాన్ ఐఏఎస్తో సరిపెడతారా...? అన్నది అధికార వర్గాల్లో చర్చ నడుస్తోంది. ప్రస్తుతం మంగళగిరి మున్సిపల్ కమిషనర్గా పనిచేస్తున్న అలీంబాషాను ఇక్కడ బదిలీ చేస్తారనే ఊహాగానాలు నడుస్తున్నాయి.

ఈదురుగాలుల బీభత్సం

- పలుచోట్ల నేలకూలిన స్తంభాలు, చెట్లు
- విద్యుత్ సరఫరాకు అంతరాయం
- 95 ఎకరాల్లో దెబ్బతిన్న ఉద్యాన పంటలు
- అల్లూరులో కుండపోత వాన
- వర్షంతో అక్కడక్కడా తడిసిన ధాన్యం



గాలివానకు అనంతసాగరంలో దెబ్బతిన్న బొప్పాయి పంట



కలువాయిలో వర్షానికి తడిసి మొలకెత్తిన ధాన్యాన్ని చూపుతున్న రైతులు



విద్యుత్ తీగలు తగిలి మృతిచెందిన గేదెలు

నెల్లూరు(వ్యవసాయం), ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): వాతావరణంలో ఒక్కసారిగా చోటుచేసుకున్న మార్పులతో జిల్లాలోని పలు ప్రాంతాల్లో బుధవారం ఉదయం ఈదురుగాలులతో స్వల్పంగా వర్షం కురిసింది. దీంతో ఉద్యాన పంటలు బాగా దెబ్బతిన్నాయి. అక్కడక్కడా ఆరబెట్టిన ధాన్యం తడిసింది. గాలివాన కారణంగా జిల్లాలో సుమారు 95 ఎకరాల్లో వివిధ ఉద్యాన పంటలు దెబ్బతిన్నట్లు ఉద్యానశాఖ ప్రాథమిక అంచనా వేసింది. జిల్లాలోని పలుప్రాంతాల్లో బొప్పాయి, అరటి, నిమ్మ, మునగ పంటలు దెబ్బతినడంతో రైతులు తీవ్ర ఆవేదనకు గురవుతున్నారు. జిల్లాలో వింజమూరు, మర్రిపాడు, కలువాయి మండలాల్లోనే అధికంగా పంటలు దెబ్బతిన్నాయి. వింజమూరు మండలంలో ఏడుగురు రైతులకు చెందిన 22 ఎకరాల్లోని అరటితోట దెబ్బతింది. కలువాయి మండలం తెలుగురాయపురంలో ఇద్దరు రైతులకు చెందిన 10 ఎకరాల మునగ చెట్లు నేలవాలాయి. ఉయ్యాలపల్లిలో 43 ఎకరాల్లో నిమ్మ, కలువాయిలో 3.8 ఎకరాల్లో అరటితోటలు దెబ్బతిన్నాయి. మర్రిపాడు మండలం పొంగూరులో నలుగురు రైతులకు చెందిన 10 ఎకరాల్లోని బొప్పాయి, మరో రైతుకు చెందిన ఎకరా నిమ్మతోట దెబ్బతింది. అనంతసాగరం మండలం అమనిచిరువెళ్లలో 5 ఎకరాల్లో సాగు చేసిన బొప్పాయి దెబ్బతింది. మొత్తం మీద 95ఎకరాల్లో పంటలు దెబ్బతిన్నట్లు అధికారులు ప్రాథమిక అంచనా వేశారు. వివిధ ప్రాంతాల్లో రైతులు కల్లాల్లో ఆరబెట్టిన ధాన్యం తడిసి పోయింది.

ఆరు గేదెల మృతి

ఈదురు గాలులకు బోగోలు మండలం జువ్వలదిన్నె పంచాయతీ కొత్తకడపాలెం పొలాల్లో విద్యుత్ స్తంభం విరిగిపడి తీగలు తెగిపోయాయి.ఆ తీగలు తగులుకొని ఐదు గేదెలు, దూడ అక్కడికక్కడే మృతిచెందాయి.

అల్లూరులో కుండబోత వర్షం

అల్లూరులో బుధవారం ఉదయం కుండపోత వర్షం కురిసింది. అరగంటపాటు వర్షం కురవడంతో రోడ్లు జలమయమయ్యాయి.

విద్యుత్ సరఫరాకు అంతరాయం

బలంగా వీచిన ఈదురుగాలులు, ఉరుములు, మెరుపులకు లింగసముద్రం మండలంలో విద్యుత్ వ్యవస్థ దెబ్బతింది.దీంతో 12 గంటలపాటు విద్యుత్ సరఫరాకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. అలాగే కలువాయి మండలంలో ఈదురు గాలులకు తెలుగురాయపురం-కోటితీర్థం మధ్యలో రోడ్డుకు అడ్డంగా తాటిచెట్లు కూలిపోయాయి. దీంతో ఆ మార్గంలో రాకపోకలు నిలిచిపోయాయి. తోపుగుంట సమీపంలో విద్యుత్ స్తంభాలు పడిపోవ డంతో సరఫరా నిలిచిపోయింది.

ఎమ్మెల్సీగా రెండోసారి బీద రవిచంద్ర ప్రమాణం



శాసనమండలి చైర్మన్ మోషేన్రాజు చాంబర్లో ప్రమాణస్వీకారం చేస్తున్న బీద రవిచంద్ర

నెల్లూరు (వైద్యం) ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి) : 'బీద రవిచంద్ర అనే నేను శాసనమండలి సభ్యుడి(ఎమ్మెల్సీ)గా ప్రమాణం చేస్తున్నా'నని బుధవారం ఆయన ప్రమాణం చేశారు. మండలి చైర్మన్ మోషేన్రాజు సచివాయంలోని తన చాంబర్లో బీద రవిచంద్రతో ఎమ్మెల్సీగా ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీలు భూమిరెడ్డి రాంగోపాల్రెడ్డి, మంతెన సత్యనారాయణ రాజు, టీడీపీ వైద్య విభాగం రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ జెడ్ శివ ప్రసాద్, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి పెళ్లకూరు శ్రీనివాసులురెడ్డి, సీనియర్ నేత గూటూరు మురళీ కన్నబాబు, టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి చేజెర్ల వెంకటేశ్వరరెడ్డి, ఇతర నాయకులు బీ గిరి, సూర్యప్రకాష్, నాగేంద్ర బ్రహ్మంచౌదరి, పలగాటి శీనయ్య తదితరులు పాల్గొన్నారు. అనంతరం వారు బీద రవిచంద్ర దంపతులను సన్మానించారు. గతంలో ఓసారి ఎమ్మెల్సీ పనిచేసిన బీద బుధవారం రెండోసారి ఎమ్మెల్సీగా బాధ్యతలు చేపట్టారు.

30న జడ్పీ సమావేశం

నెల్లూరు,(జడ్పీ) ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశం ఈనెల 30వ తేదీన నిర్వహించనున్నట్లు జడ్పీ సీఈవో విద్యారమ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆరోజు ఉదయం 10.30 గంటలకు జడ్పీలోని సమావేశ మందిరంలో ఈ సమావేశం నిర్వహి స్తామన్నారు. జిల్లా వ్యవసాయశాఖ, గ్రామీణ నీటిసరాపరశాఖల పని తీరు, జడ్పీ బడ్జెట్ పై సమావేశంలో చర్చిస్తామని, సభ్యులంతా హాజరు కావాలని ఆమె తెలిపారు.

తుది దశకు వర్క్ ఫ్రం హోం సర్వే

- జిల్లాలో 18 నుంచి 50 ఏళ్లలోపున్న వారి వివరాల సేకరణ
- కలిసిన కుటుంబాలు 5,95,817
- సర్వే చేసిన జనాభా 12,91,991 మంది
- వివిధ పనులు చేస్తున్నవారు 2,18,890
- ఇంటి నుంచి పనిచేస్తున్నవారు 14,182
- ఏ పనీ చేయనివారు 7,48,735

నెల్లూరు(హరనాథపురం), ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి): నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు కల్పించడానికి కూటమి ప్రభుత్వం కొత్త విధానాన్ని తీసుకువచ్చింది. ఇందులో భాగంగా జిల్లాలోని నగరపాలకసంస్థతో పాటు, పట్టణాలు, గ్రామాల్లో 18 నుంచి 50 ఏళ్లలోపున్న వారు ఏమి చేస్తున్నారనే వివరాలు సేకరించింది. గ్రామ, వార్డు సచివాలయాల సిబ్బంది ఇంటింటికి వెళ్లి వర్క్ ఫ్రం హోం పేరిట సర్వే చేశారు. ఇంటి నుంచి పని చేయడానికి బ్రాడ్ బ్యాండ్, వైఫై సదుపాయం, ఇంటర్నెట్ కనెక్షన్ ఉందా? అనే వివరాలు నమోదు చేశారు.ఈ సర్వేలో జిల్లాలో 7,48,735 మంది ఏపనీ లేక ఖాళీగా ఉన్నట్లు తేలింది.

ఎస్ఆర్పురంలో పనిమంతులు ఎక్కువే..

ముఖ్యంగా నెల్లూరు నగరపాలక సంస్థ పరిధిలో 1,42,408 కుటుంబాలను సర్వే చేశారు. ఈసర్వేలో 18 నుంచి 50 ఏళ్ల లోపు వారు 3,05,751 మంది ఉన్నట్లు గుర్తించారు. వీరిలో 60,771 మంది వివిధ పనులు చేస్తున్నారు. వర్క్ ఫ్రం హోంలో 5,272మంది పనిచేస్తున్నారు. ఏ పనీలేని వారు 1,34,097 మంది ఉన్నారని గుర్తించారు. కావలి అర్బన్లో 53,229 మందిని సర్వే చేయగా 11,997 మంది వివిధ పనులు చేస్తున్నారు. ఏపనీ చేయని వారు 30,555 మంది ఉన్నారు. బుచ్చి నగర పంచాయతీలో 41,190 మందిని సర్వే చేయగా, వారిలో 8,115 మంది రకరకాల పనులు చేస్తున్నారు. 24,178 మంది ఏపనీ చేయటం లేదని తేలింది. కందుకూరులో 31,895 మందిని సర్వే చేయగా, 6,774 మంది వివిధ పనులు చేస్తున్నారు. 18,010 మంది ఏపనీ చేయటంలేదని తేలింది. ఏ పనీ లేకుండా ఉన్నవారు నెల్లూరు, కావలి, బుచ్చి తరువాత పొదలకూరులో 24,178 మంది, అత్యల్పంగా సీతారామపురం(ఎస్ఆర్పుం)లో 6,602 మంది ఉన్నారు. దుత్తలూరులో 8,560మంది, వరకుంటపాడులో 8,422 మంది ఉన్నారు. జిల్లా వ్యాప్తంగా తీసుకుంటే 5,95,817 కుటుంబాలను సర్వే చేయగా, ఈ కుటుంబాల్లో 12,92,786 మంది జనాభా ఉన్నట్లు నిర్ధారించారు. వీరిలో 12,91,991 మందిని సర్వేను పూర్తి చేశారు.



మహిళనడిగి కుటుంబ సభ్యుల వివరాలు తెలుసుకుంటున్న సచివాలయ ఉద్యోగిని

అందులో 2,18, 890 మంది వివిధ ఉద్యోగాలు చేస్తున్నారు. 7,48,735 మంది ఏ ఉద్యోగం లేకుండా ఉన్నారు. 14,182 మంది వర్క్ ఫ్రం హోంలో ఉన్నారని తేలింది. సాధారణంగా పట్టణాల్లో పనిదొరుకుతుం దని ఎక్కువ మంది గ్రామాల నుంచి పట్టణాలకుకు వలస వస్తుంటారు. కానీ జిల్లాలోని పట్టణాల్లోనే ఏపనీ లేని వారు అధికంగా ఉండడం గమనార్హం.



వర్క్ఫ్రం హోం ఉద్యోగి ఫొటో తీసుకుంటున్న సచివాలయ ఉద్యోగి

ఇంటి నుంచే పనిచేసుకునేలా..

కూటమి ప్రభుత్వం వచ్చే నాలుగేళ్లలో ఇంటి నుంచే పనిచేసుకునేలా నిరుద్యోగులకు అవకాశాలు కల్పించనుంది. వయసులవారీగా ఉపాధి అవకాశాలు కూడా కల్పించనుంది. డిగ్రీ, ఇంజనీరింగ్ పూర్తి చేసిన యువ తకు శిక్షణ ఇచ్చి సాఫ్ట్వేర్ రంగంలో అవకాశాలు కల్పించే దిశగా అడుగులు వేస్తున్నది. ఇందు కోసం వర్క్ ఫ్రం హోం సర్వేను ప్రభుత్వం చేపట్టింది. ఈ సర్వే ప్రస్తుతం జిల్లాలో 99 శాతం పూర్తయింది. మిగిలిన ఒకశాతం పూర్తయితే ఆ వివరాలను అధికారులు ప్రభుత్వానికి పంపనున్నారు.

సర్వేతో మంచి అవకాశం

రాష్ట్రంలో ఐటీ కంపెనీలతోపాటు, పలు నూతన కంపెనీలు అతి త్వరలో ఏర్పాటు కానున్నాయి. దీంతో ఈ సర్వే ప్రాధాన్యత సంతరించుకోనుంది. ఈ సర్వే వివరాల ప్రకారం ప్రభుత్వం ప్రతి కుటుంబంలోని నిరుద్యోగికి తప్ప కుండా ఏదో ఒక కంపెనీలో వర్క్ ఫ్రం హోం పద్ధతిలో ఉపాధి కల్పించే అవకాశం ఉంది. లేదా నేరుగా ఉపాధి చూపించే వీలుంది.

ప్రభుత్వానికి వివరాలు పంపుతాం

జిల్లాలో 99 శాతం వర్క్ ఫ్రం హోం సర్వేను పూర్తి చేశాం. మిగిలిన ఒకశాతం సర్వేను కూడా పూర్తి చేసి వివరాలను ప్రభుత్వానికి పంపుతాం. దీంతో నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు మెరుగుపడే వీలుంది.

- హాఫీజ్, సచివాలయాల జిల్లా పర్యవేక్షణ అధికారి

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో (రూ.లలో)
బాయిలర్ లైవ్	119
స్కిన్ చికెన్	214
స్కిన్‌లెస్	236

కోడిగుడ్ల ధర (100) : 415

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)	
ఒక గ్రాము ధర	రూ.9128
వెండి కిలో ధర	రూ. 99.600
వెండి ఒక గ్రాము	రూ.102.60

ప్రకృతి వ్యవసాయంతో రైతులకు లాభం

కొండాపురం, ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి): ప్రకృతి వ్యవసాయంతో రైతులు తక్కువ పెట్టుబడితో అధిక లాభం పొందవచ్చని ఎంపీడీవో ఆదినారాయణ పేర్కొన్నారు. ప్రకృతి వ్యవసాయంపై బుధవారం స్థానిక ఆదర్శ పాఠశాలలో అగ్రికల్చరల్ అసిస్టెంట్లు, అంగన్‌వాడీలు, వీవోఏలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేలాది రూపాయలు పెట్టి రసాయన ఎరువులు వాడకం రైతులకు అధిక భారమవుతుందని దీనికి బదులుగా సేంద్రియ ఎరువులు వాడి అధిక దిగుబడులు పొందవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో ఆదర్శ పాఠశాల ప్రిన్సిపాల్ షేక్ ఖాదర్‌బాషా పాల్గొన్నారు.

న్యూస్ బాక్స్

లింగంగుంటలో వృద్ధురాలి మృతదేహం

గుడ్లూరు, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి) : గుడ్లూరు లింగం గుంటలో వృద్ధురాలి మృతదేహం బుధవారం వెలుగు చూసింది. స్థానికుల కథనం మేరకు.. గుడ్లూరు తెట్టు రోడ్డులోని కల్యాణ మండపం సమీపంలో నివాసం ఉండే సాదినేని సుశీలమ్మ (70) రెండు రోజుల క్రింతం కుటుంసభ్యులతో గొడవపడి ఇంటి నుంచి వెళ్లిపోయింది. ఈ క్రమంలో లింగం గుంటలో నీటిపై తేలాడుతున్న మృతదేహాన్ని స్థానికులు గుర్తించారు. సమాచారం అందుకున్న మృతురాలి కుటుంబ సభ్యులు ఘటనస్థలానికి చేరుకొని మృతురాలు సుశీలమ్మగా గుర్తించి వెలికితీసి అంత్యక్రియలు నిర్వహించారు. దీనిపై పోలీసులకు ఎలాంటి సమచారం అందలేదని ఎస్‌ఐ వెంకట్రావు తెలిపారు.

21 నుంచి ఉచిత కంప్యూటర్ శిక్షణ

కందుకూరు, ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ఏపీఎస్‌డీసీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన స్కిల్ హబ్‌సెంటర్‌లో మూడు నెలల ఉచిత కంప్యూటర్ శిక్షణ ఇస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ షేక్ రియాజుద్దీన్ ఒక ప్రకటనలో తెలిపారు. పది, ఇంటర్, డిగ్రీ, ఇంజనీరింగ్ కోర్సులు పూర్తి చేసిన నిరుద్యోగ యువత ఈ ఉచిత కంప్యూటర్ శిక్షణకు అర్హులని తెలిపారు. ఈనెల 21 నుంచి ప్రారంభం కానున్న నూతన బ్యాచ్‌లో చేరేందుకు దరఖాస్తులు స్వీకరిస్తున్నామని ఆయన తెలిపారు.

నేడు ప్రజావేదిక

వలేటివారిపాలెం, ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి): వలేటివారిపాలెం ఉపాధి హామీ కార్యాలయం వద్ద గురువారం ఉదయం 10 గంటలకు సామాజిక తనిఖీ ప్రజా వేదిక జరుగుతుందని ఎంపీడీవో నరేంద్రదేవ్, ఏపీవో దయాసాగర్ బుధవారం ఓ సంయుక్త ప్రకటనలో తెలిపారు. మండలంలో 2023-24 ఆర్థిక సంవత్సరంలో ఉపాధిహామీ, ఆర్‌డబ్ల్యూఎస్, హౌసింగ్, పంచాయతీరాజ్‌శాఖల్లో చేపట్టిన పనులపై గత నెలలో క్షేత్రస్థాయిలో సామాజిక తనిఖీ నిర్వహించారని పేర్కొన్నారు. గ్రామాల్లో చేపట్టిన సామాజికి తనిఖీ బృందం గుర్తించిన వివరాలను ప్రజావేదికలో వెల్లడించనున్నట్లు తెలిపారు. సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు, ఉపాధిహామీ క్షేత్రసహాయకులు తప్పక హాజరుకావాలని తెలిపారు.

ముగిసిన సంగమేశ్వరుడి బ్రహ్మోత్సవాలు



ఏకాంత సేవలో సంగమేశ్వరస్వామి

సంగం, ఏప్రి ల్ 16 (ఆంధ్ర జ్యోతి): స్థానిక సంగమేశ్వరాలయంలో జరుగుతున్న బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళ వారం అర్ధ రాత్రి సంగమేశ్వరుని ఏకాంతసేవ నిర్వహించారు. ఏకాంత సేవతో బ్రహ్మోత్సవాలు ముగిసాయి.

ఘనంగా కందుకూరి జయంతి



కందుకూరి చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న విద్యార్థులు

అనంతసాగరం ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చిలకల మర్రి ఉన్నత పాఠశాలలో బుధవారం కందుకూరి వీరేశలింగం పంతులు జయంతి వేడుకలు నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం సురేష్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పంట కాలువల్లో పూడిక తీయాలని రైతుల ఆందోళన



ఇరిగేషన్ కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తున్న రైతులు

సంగం, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తరుణవాయి పొలాల్లోని అంతర్గత పంట కాలువల్లో పూడిక తీయాలని రైతులు ఇరిగేషన్ కార్యాలయం వద్ద బుధవారం ఆందోళన చేశారు. ఆమేరకు వారు కార్యాలయంలో ఏఈ వినయ్ కుమార్‌ను కలిసి పంట కాలువల్లో పూడికతీయకపోతే ఎడగారులో నీళ్లు పారవని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో తరుణవాయి పొలాల రైతులు పాల్గొన్నారు.

పార్కుల అభివృద్ధికి దాతలు ముందుకు రావాలి

● ఎమ్మెల్యే దగుమాటి వెంకటకృష్ణారెడ్డి

కావలిటౌన్, ఏప్రిల్ 18(ఆంధ్రజ్యోతి) : పట్టణంలో పార్కుల అభివృద్ధికి దాతలు ముందుకు రావాలని ఎమ్మెల్యే దగుమాటి వెంకటకృష్ణారెడ్డి పిలుపునిచ్చారు. ఇంటింటికి ఎమ్మెల్యే.. సమస్య మీది పరిష్కారం నాది.. కార్యక్రమంలో భాగంగా బుధవారం ఆయన 8వ వార్డులో పర్యటించారు. వార్డులోని వరవ కాలువ దుస్థితిపై స్థానికులు ఎమ్మెల్యేకు ఫిర్యాదు చేయగా స్పందించిన ఆయన కాలువను ఎందుకు పట్టించుకోవడం లేదని అక్కడే ఉన్న మున్సిపల్ కమిషనర్ శ్రావణ్‌కుమార్, డీఈలను ప్రశ్నించారు. అనంతరం వివేకానంద పార్కును సందర్శించి నూతనంగా ఏర్పాటు చేసిన వ్యాయామ పరికరాలను ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ కావలి అభివృద్ధే తన ప్రధాన అజెండా అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఖమర్‌బాబు, షాకీరా బేగం, చవల రామకృష్ణ, రహీం, షబ్బు, పట్టణ అధ్యక్ష కార్యదర్శి గుత్తికొండ కిషోర్, జ్యోతి బాబురావు, పోట్లూరి శ్రీనివాసులు పాల్గొన్నారు.



వరవ కాలువ దుస్థితిపై కమిషనర్‌ను ప్రశ్నిస్తున్న ఎమ్మెల్యే కృష్ణారెడ్డి

వైసీపీ మైనార్టీ నేతలు టీడీపీలో చేరిక

వైసీపీ మైనార్టీ నాయకులు బుధవారం ఎమ్మెల్యే వెంకట కృష్ణారెడ్డి సమక్షంలో టీడీపీలో చేరారు. పార్టీలో చేరిన వైసీపీ మైనార్టీ సెల్ అధ్యక్షుడు మొగల్ రహీం బేగ్, మాజీ మున్సిపల్ కోఆప్షన్ సభ్యురాలు షమ్మా, రూరల్ మండల మైనార్టీ సెల్ మాజీ అధ్యక్షుడు పీర్‌మొహమ్మద్, వైసీపీ జిల్లా కమిటీ నాయకురాలు పర్వీన్‌జాని తదితరులకు ఎమ్మెల్యే కృష్ణారెడ్డి కండువాలు వేసి ఆహ్వానించారు.

వైభవంగా సీతారాముల ధ్వజస్తంభ ప్రతిష్ఠ



ధ్వజ స్తంభం ప్రతిష్ఠలో పాల్గొన్న భక్తులు

కందుకూరు, ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి): కందుకూరు మున్సిపాలిటీ పరిధిలోని దివివారిపాలెంలో నూతనంగా నిర్మించిన సీతా సమేత కోదండరామాలయంలో విగ్రహ ప్రతిష్ఠామహోత్సవం, మహాకుంభాభిషేకం, ధ్వజస్తంభ ప్రతిష్ఠ వైభవంగా జరిగాయి. మూడు రోజులుగా శాస్త్రోక్తంగా యజ్ఞయాగాలతో పాటు ప్రత్యేక పూజా కార్యక్రమాల అనంతరం బుధవారం ఉదయం ధ్వజస్తంభ ప్రతిష్ఠ వేలాదిమంది భక్తుల సమక్షంలో వేడుకగా నిర్వహించారు. ఆలయ నిర్మాణంకు తోడ్పాటునందించిన దివి రవీంద్రనాథ్‌కు అభినందనలు తెలిపారు. యజ్ఞంలో దివి రవీంద్రనాథ్, మాజీ ఎమ్మెల్యే దివి శివరాం, లింగయ్యనాయుడు దంపతులు తదితరులు పాల్గొన్నారు. కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు, ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్, ఎమ్మెల్సీ తూమాటి మాధవరావు, ప్రకాశం ఇంజనీరింగ్ కాలేజీ కరస్పాండెంట్ కంచర్ల రామయ్య తదితరులు హాజరై పూజలు చేశారు. భక్తులకు అన్నప్రసాదం ఏర్పాటు చేశారు.

వ్యక్తి వికాసానికి పునాది ప్రభుత్వ పాఠశాలలు

లింగసముద్రం, ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి) : వ్యక్తి వికాసానికి, సమాజ మార్పుకు పునాదులు ప్రభుత్వ పాఠశాలలని ఎంఈవో-2 శివకుమార్ చెప్పారు. బుధవారం లింగసముద్రంలోని కేఆర్ జడ్పీ హైస్కూల్‌లో కాంప్లెక్స్ పరిధిలోని 15 పాఠశాలలకు చెందిన 78 మంది 5వ తరగతి విద్యార్థులకు టాలెంట్ టెస్ట్ నిర్వహించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు యు మాధవరావు పర్యవేక్షణలో జరిగిన టాలెంట్ టెస్ట్ ఎంఈవో శివకుమార్ పరిశీలించారు. ప్రతిభ చూపిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో మొగిలిచెర్ల హెచ్‌ం కె.సూర్యప్రకాశరావు, ఉపాధ్యాయులు కొండయ్య, కె.వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్య లేకుండా చూడాలి : ఎంపీపీ

కలిగిరి, ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి): రానున్న వేసవి దృష్ట్యా మండలంలోని అన్ని గ్రామాల్లో తాగునీటి సమస్య లేకుండా చర్యలు చేపట్టాలని ఎంపీపీ మెట్టుకూరు శిరీష అధికారులకు సూచించారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో బుధవారం జరిగిన మండల సర్వసభ్య సమావేశంలో ఎంపీపీ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో ప్రత్యూష, జడ్పీటీసీ పాలూరు మాల్యాద్రిరెడ్డి, తదిరులు పాల్గొన్నారు.

మొక్కుబడిగా కొండాపురం మండల సమావేశం

కొండాపురం, ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి): స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ బొడ్డు అనూరాధ అధ్యక్షతన బుధవారం నిర్వహించిన మండల సమావేశం మొక్కుబడిగా జరిగింది. మూడు నెలల కాలంలో విద్య, వైద్యం, గ్రామీణ నీటి సరఫరా, పంచాయతీరాజ్, పశుసంవర్ధకశాఖ, ఇరిగేషన్, వ్యవసాయం తదితర శాఖలలో జరిగిన అభివృద్ధిపై సంబంధిత అధికారులతో ఎంపీడీవో ఆదినారాయణ సమీక్షించారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఐ ఎం.వెంకటరావు, ఎంఈవో-2 ఆనందరావు, పలుశాఖల అధికారుల తోపాటు ఎంపీటీసీలు, సర్పంచులు తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలకు బీరువాలు, కుర్చీల వితరణ

బిట్రగుంట, ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి): బిట్రగుంట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు నెల్లూరు ప్రగతి క్లబ్ చైర్మన్ డీఎన్ కుమార్ రెండు బీరువాలు, 50 కుర్చీలను బుధవారం అందజేశారు. అలాగే వాకా మహేశ్వరరెడ్డి 10 కుర్చీలను వితరణ చేశారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం కనకారావు, సరస్వతి నమస్తుభ్యం కమిటీ చైర్మన్ ప్రసాదరావు, క్లబ్ సభ్యులు సుబ్బారావు, గుప్తా, ఎస్‌ఎంసీ చైర్మన్ తాత మదన్, కోఆప్షన్ సభ్యుడు వాకా మహేష్‌రెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మాజీ ఎమ్మెల్యే వ్యాఖ్యలు అర్థరహితం

బిట్రగుంట, ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వంపై మాజీ ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్ రెడ్డి వ్యాఖ్యలు అర్థరహితమని టీడీపీ బోగోలు ఇంచార్జి చిలకపాటి వెంకటేశ్వర్లు అన్నారు. బోగోలులోని ఆయన నివాసంలో బుదవారం విలేకర్లతో మాట్లాడారు. గ్రావెల్, ఇసుక, మట్టి మాఫియా దొంగలు ఎవరో జిల్లాలో అందరికీ తెలుసన్నారు. నీతులు మాట్లాడుతున్న వైసీపీ నేత వీరరఘు గ్రావెల్ తవ్వకాలో వాటా తీసుకోలేదని ప్రమాణం చేయాలన్నారు. మధుబాబునాయుడు గురించి మాట్లాడే అర్హత ఆయనకు లేదన్నారు. సుకుమార్‌రెడ్డి ఎవరి అవినీతి గురించి బహిరంగా చెప్పారో ప్రజలు విన్నారన్నారు. టీడీపీ నేతలు నాగరాజు, అర్పత్‌రాజ్, శీనయ్య, ఎస్.వెంకట్రారావు, బీప్రభాకర్, పీ.రమేష్‌బాబు పాల్గొన్నారు.

లక్ష్యంతో చదివి ఉన్నతస్థితికి చేరాలి

● ఎమ్మెల్యే ఇంటూరి



టీఆర్‌ఆర్ ప్రభుత్వ కళాశాలలో అబ్దుల్‌కలాం విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు

కందుకూరు, ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు లక్ష్యంతో చదివి ఉన్నత స్థితికి ఎదగాలని ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు పేర్కొన్నారు. స్థానిక టీఆర్‌ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రాంగణలో ఏర్పాటు చేసిన మాజీ రాష్ట్రపతి ఏపీజే అబ్దుల్‌కలాం విగ్రహాన్ని బుధవారం ఆయన ఆవిష్కరించారు. దాతల తోడ్పాటుతో ఏర్పాటు చేసిన బాస్కెట్‌బాల్ కోర్టును ప్రారం భించారు. అనంతరం విద్యార్థులకు ప్రభుత్వం అందిస్తున్న ఉచిత పాఠ్యపుస్తకాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వంలో విద్యా సంవత్సరం ప్రారంభ మయ్యాక మూడు నాలుగు నెలలకు పాఠ్య పుస్తకాలు సరఫరా చేసేవారని, కానీ ప్రస్తుత విద్యాశాఖా మంత్రి నారా లోకేష్ ముందుచూపుతో ముందస్తుగానే పాఠ్యపుస్తకాలు పంపిణీ చేయిస్తున్నారని తెలిపారు. దాత లను ఎమ్మెల్యే ఇంటూరి, ఎమ్మెల్యేను ప్రిన్సిపాల్ నాగూర్‌వలీ సత్కరించారు.

తీగలు తెగి విద్యుత్ అంతరాయం

లింగసముద్రం, ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి) : మండలంలో బుధవారం ఉదయం వీచిన ఈదురు గాలులకు విద్యుత్ తీగలు తెగిపడి 12 గంటలు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. మండలంలోని వెంగళాపురంతో పాటు పలు గ్రామాల్లో బలమైన ఈదురు గాలులు వీయడంతో పాటు ఉరుములు, మెరుపులతో చిరుజల్లులు కురిశాయి. దీంతో వెంగళాపురంలోని 132 కేవీ సబ్‌స్టేషన్ ఎదురుగా ఉన్న విద్యుత్ స్తంభం తీగ, శింగరపాలెం సమీపంలోని చాకిరేవు వాగు వద్ద ఉన్న రెండు విద్యుత్ స్తంభాల తీగలు తెగి కిందపడ్డాయి. వెంగళాపురం, చినపవని, శాయిపేటలో ఇన్సులేటర్లు పగిలి పోయాయి. విద్యుత్‌శాఖ ఏఈ షేక్ ఫిరోజ్, సిబ్బంది యుద్ధప్రాతిపదికన తెగిన తీగలు బిగించి, ఇన్సులేటర్లు కొత్తవి ఏర్పాటు చేసి విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు.

విరిగిన విద్యుత్ స్తంభాలు

బిట్రగుంట : బోగోలు మండలంలో ఉదయం నుంచి ఈదురు గాల్పులు వీచడంతో జువ్వలదిన్నె పంచాయతీ కొత్తకడపాలెం పొల్లాలో విద్యుత్ స్తంభం విరిగి పడ్డంతో విద్యుత్ తీగలు తెగిపోయాయి. ఆ సమయంలో పొలంలో మేత మేస్తున్న ఐదు గేదెలు, దూడ విద్యుత్ తీగలు తగిలి అక్కడికక్కడే మృతి చెందాయి. పశువుల కాపరులు సహాయక లైన్‌మెన్ సుబ్బారెడ్డికి సమాచారం ఇవ్వడంతో ఆయన విద్యుత్ సరఫరా నిలిపివేయించారు. అనంతరం సంఘటన్నా స్థలానికి చేరుకుని జరిగిన ప్రమాద విషయాన్ని ఏఈ జడరాయ్‌కు తెలియజేశారు. విశ్వనాథరావుపేట పంచాయతీ రామస్వామిపాలెం గిరిజన కాలనీలో విద్యుత్ స్తంభం విరిగిపడింది. ఎస్సీ బాలుర హాస్టల్ సమీపంలో విద్యుత్ తీగలు తెగిపడ్డాయి. లైన్‌మెన్ బ్రహ్మయ్య సిబ్బందితో మరమతులు చేపట్టారు. దీంతో మధ్యాహ్నం రెండు గంటల వరకు విద్యుత్‌కు అంతరాయం ఏర్పడింది.

అల్లూరులో కుండపోత వాన

అల్లూరు : అల్లూరులో బుధవారం ఉదయం కుండపోత వాన కురిసింది. ఉన్నట్టుండి ఆకాశం మేఘావృతమై అరగంటపాటు భారీ వర్షం కురవడంతో రోడ్లు జలమయమయ్యాయి. ఈదురుగాలులు విస్తృతంగా వీయడంతో వాన జల్లులు తీవ్రతరం దాల్చాయి.

చెత్త బుట్టల పంపిణీ



వలేటివారిపాలెం ఎస్సీ కాలనీలో చెత్త బుట్టలు పంపిణీ చేస్తున్న సర్పంచు శ్రీలత

వలేటివారిపాలెం, ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి): వలేటివారిపాలెం గ్రామ సచివాలయంలో వృథాగా ఉన్న తడి పొడి చెత్త బుట్టలను పంచాయతీ కార్యదర్శి మురళి గ్రామ సర్పంచు సాధు శ్రీలత ద్వారా బుధవారం స్థానిక ఎస్సీ కాలనీలో ఇంటింటికి పంపిణీ చేయించారు. 'సచివాలయంలోనే చెత్త బుట్టలు' అని బుధవారం ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనానికి పంచాయతీ కార్యదర్శి మురళి స్పందించి వీటిని పంపిణీ చేయించారు.

సమస్యల పరిష్కారం కోసం మున్సిపల్ కార్మికుల ఆందోళన



మున్సిపల్ కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తున్న సీఐటీయు నాయకులు, కార్మికులు

ఆత్మకూరు, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): సమస్యలు పరిష్కరించాలని కోరుతూ బుధవారం సీఐటీయు ఆధ్వర్యంలో మున్సిపల్ కార్మికులు ఆందోళన చేశారు. ఈ సందర్భంగా మున్సిపల్ కార్మికుల సంఘం గౌరవ అధ్యక్షుడు కె డేవిడ్‌రాజు, కార్యదర్శి నాగేంద్ర మాట్లాడుతు మున్సిపల్ కార్మికులకు సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని, రెగ్యులర్ చేయాలని కోరారు. ఈమేరకు మున్సిపల్ కార్మికులు, సీఐటీయు నాయకులు మున్సిపల్ కమిషనర్ సి గంగాప్రసాద్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సీఐటీయు ఉపాధ్యక్షుడు ఎస్‌డి రిజ్వాన్, కార్మిక నేతలు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయం ఆరోగ్యకరం

సీతారామపురం, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో పండించిన ఆహారాన్ని తీసుకుంటే ఆరోగ్యంగా ఉండవచ్చని ఏపీఎం వైనారూత్ అన్నారు. బుధవారం స్థానిక వెలుగు కార్యాలయంలో ఏపీఎం అధ్యక్షతన డ్వాక్రా సంఘాలకు ప్రకృతి వ్యవసాయంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈసందర్భంగా ప్రకృతి వ్యవసాయ అధికారులు సురేష్, రాంమోహన్ మాట్లాడుతూ ప్రతి గ్రామంలో ప్రతి మహిళ ప్రకృతి వ్యవసాయ విధానాలను పాటించాలని కోరారు. ఈకార్యక్రమంలో సిసిలు, ఎఈవో సాంబశివయ్య, మండల వ్యవసాయ సిబ్బంది, పాల్గొన్నారు.

నేడు తాగునీటి సరఫరాకు అంతరాయం

ఆత్మకూరు, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): స్థానిక తహసీల్దారు కార్యాలయం సమీపంలో గల వాటర్ ట్యాంకు మరమ్మతు పనుల దృష్ట్యా గురువారం తాగునీటి సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని మున్సిపల్ కమిషనర్ సి గంగాప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈక్రమంలో మున్సిపాల్టీ పరిధిలోని 3,4,5,21,22,23 వార్డులలో తాగునీటి సరఫరా నిలిపివేయడం జుగుతుందన్నారు. మరుసటి రోజు యధావిధిగా నీటి సరఫరా జరుగుతుందని, ప్రజలు సహకరించాలని కోరారు.

సబ్సిడీ రుణాలకు దరఖాస్తుల ఆహ్వానం

ఉదయగిరి, ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి): ఎస్సీ కార్పొరేషన్ సబ్సిడీ రుణాల కోసం అర్హులైన ఎస్సీ లబ్ధిదారుల నుంచి ఓబీఎంఎంఎస్ ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఎంపీడీవో అప్పాజీ తెలిపారు. స్థానిక కార్యాలయంలో బుధవారం ఆయన విలేఖరులతో మాట్లాడుతూ 2023-24 ఆర్థిక సంవత్సరానికి ఎస్సీ కార్పొరేషన్ ద్వారా మండలానికి 15 యూనిట్లు మంజూరయ్యాయన్నారు. అర్హులైన వారు వచ్చేనెల 10వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు.

పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలి

ఉదయగిరి, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని బుధవారం మండలంలోని గండిపాళెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన ఉపాధ్యాయులు మాలకొండారెడ్డి, ఖాజాఅహ్మద్, ధనమ్మ, హసీనాలు గ్రామంలో పర్యటించారు. బిడ్డల బంగారు భవిష్యత్తు కోసం ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని ప్రచారం చేపట్టారు.

గర్భిణులు పౌష్టికాహారం తీసుకోవాలి

దుత్తలూరు (ఉదయగిరి), ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): బాలింతలు, గర్భిణులు పౌష్టికాహారం తీసుకోవాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ షేక్ షాను సూచించారు. బుధవారం మండలంలోని భైరవరం మెయిన్ అంగన్‌వాడీ కేంద్రంలో నిర్వహించిన పౌష్టికాహార మాసోత్సవాల్లో పాల్గొని మాట్లాడారు. గర్భిణులు, బాలింతలు, కిశోర బాలికల సమగ్ర ఆరోగ్య అభివృద్ధి లక్ష్యంగా పోషణ పక్వాడ్ నిర్వహిస్తున్నామన్నారు.

పాఠశాలలో తిథి భోజన కార్యక్రమం

ఉదయగిరి, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దుర్గంపల్లి ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు జాఫర్‌అహ్మద్ బుధవారం విద్యార్థులకు తిథి భోజనం అందించారు. ఈ కార్యక్రమంలో ఎంఈవోలు షేక్ మస్తాన్‌వలి, తోట శ్రీనివాసులు పాల్గొన్నారు.

గాలివానతో వాణిజ్య పంటలకు నష్టం

● ధాన్యం తడవడంతో అన్నదాతల ఆందోళన ● కూలిన బొప్పాయి, తాటిచెట్లు, విద్యుత్ స్తంభాలు



ఈదురు గాలులకు కలువాయి మండలం తెలుగురాయపురం-కోటితీర్థం రోడ్డుపై కూలిన తాటిచెట్లు

కలువాయి, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): అకాల వర్షంతో అన్నదాతకు అపార నష్టం వాటిల్లింది. ప్రస్తుతం మార్కెట్‌లో ఆశించిన ధర లేకపోవడంతో రైతులు పొలాల్లో నుంచి ధాన్యాన్ని ఎత్తుగా నీరు నిల్వకుండా ఉండే చోటుకు తరలించి అక్కడ ఆరబెట్టుకుంటున్నారు. ఈ దశలో ఆదివారం రాత్రి, మంగళవారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. దీంతో నిల్వ చేసుకున్న కుప్పలతో పాటు, ఆరబెట్టుకున్న ధాన్యం కొంతమేరకు తడిచిపోయింది. గిట్టుబాటు ధర లేక ధాన్యం నిల్వ చేసుకుంటే అకాల వర్షం నిండా ముంచిందని వాపోతున్నారు. కాగా, మొలకెత్తిన ధాన్యాన్ని జనసేన పార్టీ మండల కన్వీనర్ మనోహర్ పరిశీలించి అధికారుల దృష్టికి తీసుకుపోతామని రైతులకు హామీ ఇచ్చారు.

ఈదురుగాలుల బీభత్సం

మండలంలో మంగళవారం సాయంత్రం ఈదురుగాలులు బీభత్సం సృష్టించాయి. తెలుగురాయపురం- కోటితీర్థం మధ్యలో రోడ్డుకు అడ్డంగా తాటి చెట్లు కూలిపోయాయి. దీంతో ఈమార్గంలో రాకపోకలు నిలిచిపోయాయి. బుధవారం సాయంత్రం వరకు కూడా రోడ్డుపై ఉన్న చెట్లు తొలగించలేదు. దీంతో కలువాయి-చేజర్ల మార్గంలో ఆర్టీసీ బస్సులు తిరగకపోవడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారు. తోపుగుంట సమీపంలో 11కేవీ విద్యుత్ లైన్ స్తంభాలు పడిపోవడంతో సరఫరా నిలిచిపోయింది. విద్యుత్‌శాఖ సిబ్బంది వెంటనే స్పందించి మంగళవారం రాత్రి 9గంటలకు విద్యుత్ సరఫరా పునరుద్ధరించారు. కలువాయి టౌన్‌లో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు దెబ్బతినడంతో వాటిని బుధవారం మార్చారు. గాలులతో విద్యుత్ శాఖకు తీవ్ర నష్టం వాటిల్లింది.

దెబ్బతిన్న బొప్పాయి పంట

అనంతసాగరం: మండలంలో మంగళవారం రాత్రి ఉరుములు, మెరుపులతో కూడిన గాలివానకు బొప్పాయి రైతులు తీవ్రంగా నష్టపోయారు. సంజీవ నగరం, గౌరవరం, అగ్రహారం, బొమ్మవరం గ్రామాల్లో ఈసారి అధిక విస్తీర్ణంలో బొప్పాయి పంట సాగు చేశారు. ప్రస్తుతం కాయ దశలో మొక్కలు గాలి వానకు వేర్లతో సహా కుప్పకూలాయి. దెబ్బతిన్న పంటలను ఆత్మకూరు ఉద్యానవన అధికారులు బుధవారం పరిశీలించి ఉన్నతాధికారులకు నివేదిక పంపిస్తామన్నారు.

వర్షంతో వీధుల జలమయం

సంగం : ఈదురు గాలులతో పాటు భారీ వర్షం కురవడంతో సంగంలో వీధులు జలమయం అయ్యాయి. దీంతో ప్రజలు, వాహనదారులు అవస్థలు పడ్డారు.

చలివేంద్రం ప్రారంభం



చలివేంద్రం ప్రారంభిస్తున్న తహసీల్దార్ కృష్ణారెడ్డి

సీతారామపురం, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): ప్రజల దాహార్తి తీరేదెలా..? అనే కథనం ఈనెల 8వ తేదీన ఆంధ్రజ్యోతిలో ప్రచురితం కావడంతో అధికార యంత్రాంగం స్పందించింది. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు డీఆర్డీఏ ఆధ్వ ర్యంలో బుధవారం తహసీల్దార్ కృష్ణారెడ్డి, ఏపీఎం వైనారూతు, మండల టీడీపీ నాయకులతో కలిసి పాతబస్టాండ్ పక్కన చలివేంద్రం ప్రారంభించారు. కార్యక్రమంలో టీడీపీ మాజీ కన్వీనర్ చెన్నకేశవులు, మండల ప్రధాన కార్యదర్శి పిడుగు రమేష్, మండల కన్వీనర్ కప్పా ప్రభాకర్‌రాజు, పాల్గొన్నారు.

తహసీల్దారు కార్యాలయం తనిఖీ

అనంతసాగరం, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): స్థానిక తహసీల్దారు కార్యాలయాన్ని ఆత్మకూరు ఆర్డీవో పావని బుధవారం తనిఖీ చేశారు. ఈసందర్భంగా రికార్డులు పరిశీలించారు.

అప్రమత్తతతోనే అగ్నిప్రమాదాల నివారణ సాధ్యం

ఉదయగిరి, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): వేసవి దృష్ట్యా అగ్నిప్రమాదాలపై ప్రతిఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని ఇన్‌చార్జి ఫైర్ అధికారి అశోక్‌కుమార్ సూచించారు. అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా బుధవారం పట్టణంలోని ఎస్టీ కాలనీ వాసులకు అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన కల్పించారు. సిలిండర్ నుంచి మంటలు వ్యాపించినప్పుడు ఏవిధంగా అదుపు చేయాలో చేసి చూపించారు. ఈ కార్యక్రమంలో అగ్నిమాపక సిబ్బంది, స్థానికులు పాల్గొన్నారు.

●మర్రిపాడు : అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా బుధవారం స్థానిక హైస్కూల్ ఆవరణలో ఫైర్‌సిబ్బంది అగ్ని ప్రమాదాల నివారణపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఇళ్లల్లో తీసుకోవలసిన జాగ్రత్తలను తెలిపారు.

కొలతల ప్రకారం పనులు చేస్తే గిట్టుబాటు కూలి

ఉదయగిరి, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ పథకం పనుల్లో కూలీలు కొలతల ప్రకారం పనులు చేసి గిట్టుబాటు కూలి పొందేలా సిబ్బంది చర్యలు చేపట్టాలని ఎంపీడీవో అప్పాజీ, ఏపీవో శ్రీనివాసరావులు సూచించారు. బుధవారం స్థానిక స్త్రీశక్తి భవనంలో ఉపాధి సిబ్బందితో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ పని ప్రదేశంలో కూలీలకు సౌకర్యాలు కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధి సిబ్బంది పాల్గొన్నారు.

ఉపాధి పనులపై సమీక్ష

సీతారామపురం: స్థానిక ఉపాధిహామీ కార్యాలయంలో బుధవారం ఏపీవో శ్యామల మండలంలో జరుగుతున్న ఉపాధి హామీ పథకం పనుల పై సిబ్బందితో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఏపీవో కూలీల హాజరు, ఆన్‌లైన్ నమోదు, పనులు తదితర అంశాలపై సమీక్షించారు. గ్రామాలలో ఉపాధి హామీ పనులు లేవని ఎవరూ చెప్పకూడదని, ప్రతీవారం లేబర్ ఇంప్రూవ్‌మెంట్ చేపట్టకపోతే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో టెక్నికల్ అసిస్టెంట్లు మురళి, రంగనాథ్, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

డీసీ పల్లిలో పొగాకు ధరలు

మర్రిపాడు, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి) : డీసీపల్లి పొగాకు వేలం కేంద్రానికి బుధవారం రైతులు 621 బేళ్లను తీసుకొని రాగా 15 కంపెనీల ప్రతినిధులు వేలంలో పాల్గొని 482 బేళ్లను కొనుగోలు చేశారు. వివిధ కారణాలతో 139 బేళ్లను తిరస్కరించారు. కేజీ గరిష్ట ధర రూ. 280 కాగా, కనిష్ట ధర రూ. 225 పలికినట్లు వేలం నిర్వహణాధికారి జి రాజశేఖర్ తెలిపారు.



నెల్లూరులోని బిషప్ చర్చికి విద్యుద్దీపాలంకరణ

రేపు గుడ్‌ఫ్రైడే

● చర్చిల ముస్తాబు

నెల్లూరు (సాంస్కృతికం), ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి) : ఈ నెల 18వ తేదీన క్రైస్తవ పండుగ గుడ్ ఫ్రైడే. ఏసుక్రీస్తును శిలువ చేసిన రోజును గుడ్ ఫ్రైడేగా జరుపుకుంటారు. దీనికోసం జిల్లాలోని చర్చిలను ప్రత్యేకంగా అలంకరించారు. క్రీస్తు శిలువ మరణం, త్యాగం, పాపాలకు క్షమాపణ తెలుపుకునే విధంగా క్రైస్తవులు 40 రోజులు ఉపవాస దీక్షలు చేపట్టి చర్చిల్లో ప్రతీరోజు ప్రార్థనలు చేశారు. గుడ్ ఫ్రైడే రోజు పలు చర్చిల పరిధిలో శిలువను మోస్తారు. శుక్ర, శనివారాలు సంతాప దినాలుగా భావిస్తారు. మూడో రోజున క్రీస్తు పునరుత్థానం సందర్భంగా ఈస్టర్ పండుగను జరుపుకుంటారు.

జిల్లా ప్రధాన న్యాయాధికారిగా శ్రీనివాస్



నెల్లూరు (లీగల్), ఏప్రిల్ 16 (ఆంధ్ర జ్యోతి) : జిల్లా ప్రధా న న్యాయాధికారిగా జీ శ్రీనివాస్ బుధ వారం బాధ్యతలు స్వీకరిం చారు. ఆయన అనంత పురం జిల్లా ప్రధాన న్యాయా ధికారిగా పనిచేస్తూ బదిలీపై నెల్లూరు వచ్చారు. ఆయనకు పలువురు న్యాయాధికారులు శుభాకాంక్షలు తెలిపారు.

వెంకటాచలం హౌసింగ్ ఏఈ సస్పెన్షన్



ఏఈ శివమోహన్

పొదలకూరు, ఏప్రిల్ 16 (ఆంధ్ర జ్యోతి): వెంకటా చలం హౌసింగ్ ఏఈగా పనిచేస్తున్న శివమోహన్ బుధ వారం సస్పెండ్ అయ్యారు. గత వైసీపీ ప్రభుత్వంలో ఈయన పొదల కూరు మండలంలో హౌసింగ్ ఏఈగా పనిచేశారు. ఆ సమయంలో పాత పక్కా ఇళ్లకు బిల్లులు చేయడంతోపాటు పలు అవినీతి ఆరోపణలు ఉన్నాయి. దీంతో ఏఈ శివమోహన్ చేసిన అవినీతి, అక్రమాలపై పలువురు ఫిర్యాదులు చేశారు. రాష్ట్రంలో టీడీపీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక సమగ్ర విచారణ చేపట్టి వాస్తవమని తేలడంతో ఏఈ శివమోహన్‌తోపాటు మరో ముగ్గురు ఇంజనీరింగ్ అసిస్టెంట్లను జిల్లా ఉన్నతాధికారులు సస్పెండ్ చేశారు.

● నేడు ప్రపంచ హీమోఫిలియా నివారణ దినం

‘హీమోఫిలియా’పై

నిర్లక్ష్యం వద్దు !

● వ్యాధి కారణంగా రక్తస్రావంతో కోమాలోకి.. ● జిల్లాలో 250 మంది బాధితులు

● జీవితాంతం చికిత్స అవసరం

నెల్లూరు (వైద్యం), ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): హీమోఫీలియా వ్యాధి (జన్యు రుగ్మత, గాయం వద్ద రక్తం ఆగకుండా ఉండే వ్యాధి).... ఈ మాట చెబితేలే ఎందరో ఉలిక్కి పడతారు. ఇలాంటి వ్యాధి ఎవరికీ రాకూడదని ప్రతి ఒక్కరూ కోరుకుంటారు. మామూలుగా చేయ్యో, కాలో తెగి రక్తం కారితే, కాసేపు అలా ఉంచితే ఆ ప్రాంతంలో రక్తం గడ్డకట్టి రక్తస్రావం ఆగిపోతుంది. అయితే హీమోఫిలియా వ్యాధిగ్రస్థుల్లో అలా కాదు... తెగిన చోట రక్తం ధారాపాతంగా కారిపోతుంది. రక్తం గడ్డకట్టే గుణం వ్యాధిగ్రస్థుల్లో ఉండదు. ఈ వ్యాధిపై నిర్లక్ష్యం వహిస్తే ప్రాణపాయం తప్పదు. ఒక్కోసారి వ్యాధిగ్రస్థుడు కోమాలోకి వెళ్లి ప్రాణాలు పోయే ప్రమాదం ఉంది. ఈ వ్యాధి వంశపారపరంగా వస్తుంది. మగవారిలోనే ఎక్కువమంది ఈ వ్యాధికి గురయ్యే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో వరల్డ్ ఫెడరేషన్ ఆఫ్ హీమోఫిలియా ప్రతిఏడాది ఏప్రిల్ 17న ప్రపంచ హీమోఫిలియా నివారణ దినం జరుపుకుంటుంది. ఈ వ్యాధిపై ప్రజలకు అవగాహన కల్పించే దిశగా వైద్యులు కృషి చేయాలని పిలుపు నిచ్చింది.



● జిల్లాలో 250 మంది బాధితులు

జిల్లాలో ప్రస్తుతం 250 మంది ఈ వ్యాధిగ్రస్థులు ఉన్నట్లు తెలుస్తున్నది. వీరంతా పలు ఆసుపత్రులలో చికిత్సలు చేయించుకుంటున్నారు. ఇప్పటికే ఈ వ్యాధి మెదడుకు సోకి 15 మంది మృత్యువాత పడ్డారు. వ్యాధిగ్రస్థులు మూడు నెలలకు ఒకసారి రక్తం ఎక్కించుకోవాల్సి ఉంటుంది. ఈ వ్యాధిపై పూర్తి స్థాయిలో అవగాహన పెంచుకోవాల్సి ఉంది. ప్రత్యేకించి మగవారిలోనే ఈ వ్యాధి లక్షణాలు వెలుగు చూస్తున్నాయి. ఎక్స్ క్రోమో జోమ్ లోపించటం వల్ల మగ వారిలోనే ఈ వ్యాధి లక్షణాలు బయటపడుతున్నాయి. అదే ఆడవారిలో రెండు ఎక్స్ క్రోమోజోమ్‌లు ఉండటంతో ఈ వ్యాధి సోకే అవకాశం తక్కువ. వయసుతో నిమిత్తం లేకుండా పుట్టిన బిడ్డ నుంచి పెద్దవారి వరకు వ్యాధిగ్రస్థులు ఉన్నారు. ప్రస్తుతం చిన్నారులలోనే ఎక్కువమంది వ్యాధిగ్రస్థులు నమోదై ఉన్నారు. వ్యాధి



లక్షణాలు

- కీళ్ల జాయింట్‌లో రక్తస్రావం జరిగి నొప్పి రావటం.
- తీవ్రమైన తలనొప్పి
- మెడ గట్టిగా ఉండటం
- స్పష్టంగా మాట్లాడలేక పోవటం
- దృష్టి లోపం
- పక్షవాతం రావడం
- దంతాల నుంచి ఎక్కువ రక్తస్రావం
- మలం, మూత్రంలో రక్తస్రావం
- బద్ధకం, నిద్రలేమి

చికిత్స

- ముందుగా వ్యాధి నిర్ధారణ చేస్తారు
- స్థాయిని బట్టి వైద్యం అందిస్తారు
- రక్త పరీక్షకు, శస్త్రచికిత్సకు ప్రత్యేక శ్రద్ధ
- రక్తంలో ఉన్న యాంటీ హీమోఫిలియా ఫ్యాక్టర్స్‌ను తయారు చేసి రోగులకు తరచూ అందించడం ద్వారా రక్తాన్ని గడ్డ కట్టిస్తారు.
- ప్రతీ నెలా ఇలాంటి యాంటీ హీమోఫిలియా ఫ్యాక్టర్స్‌ను ఎక్కించు కోవాల్సి ఉంటుంది.

సరైన అవగాహనే వ్యాధికి మందు

ప్రధానంగా ఈ వ్యాధికి అవగాహనే మందు. వ్యాధిని గుర్తించి వెంటనే తగిన వైద్య చికిత్సలు అందించాలి. లేదంటే ప్రాణాపాయానికి దారితీయవచ్చు. ఈవ్యాధిపై అవగాహన లేకే, కొంత మంది తీవ్రఅనారోగ్యానికి లోనై ప్రాణాపాయానికి గురవుతున్నారు. ఎక్కువగా మగవారే వ్యాధికి గురవుతున్నారు. తల్లి నుంచి బిడ్డకు వ్యాధిసోకే అవకాశం ఎక్కువగా ఉంటుంది.

- డాక్టర్ గంగాధర్, జనరల్ ఫిజిషియన్, జీజీహెచ్



నెల్లూరంటే సినిమా హబ్

● ‘అక్కడ అమ్మాయి.. ఇక్కడ అబ్బాయి’ యూనిట్

● నగరంలో సందడి

నెల్లూరు (సాంస్కృతికం), ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి) : నెల్లూరు అంటే సినిమా హబ్ అని, పరిశ్రమకు ఎంతో మంది నటులు, దర్శకులు, నిర్మాతలను అందించిన జిల్లా అని అక్కడ అమ్మాయి... ఇక్కడ అబ్బాయి చిత్ర యూనిట్ పేర్కొంది. బుధవారం నెల్లూరులో ఆ సినిమా బృందం సందడి చేసింది. రెయిన్ థియేటర్స్‌లో ప్రేక్షకులను కలుసుకుంది. హీరో ప్రదీప్, హీరోయిన్ దీపికా, దర్శకులు నితిన్, భరత్ విలేకరులతో మాట్లాడారు. ప్రయోగాత్మకం గా తీసిన చిత్రాన్ని ఆదరిస్తున్నందుకు కృతజ్ఞతలు తెలిపారు. నెల్లూరీయులు అందరూ తమ సినిమా చూడాలని కోరారు. కష్టపడి ఈ సినిమా తీశాం. ఆదరించి, ఆశీర్వదించండి అని హీరోయిన్ దీపికా పిల్లి విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో భార్గవి ఆటోమొబైల్స్ ప్రైవేటు లిమిటెడ్ ఎండీ నిరంజన్‌రెడ్డి, జనరల్ మేనేజర్ రవి తదితరులు పాల్గొన్నారు.



రెయిన్ థియేటర్స్‌లో మీడియాతో మాట్లాడుతున్న హీరో ప్రదీప్, పక్కన హీరోయిన్ దీపికా, దర్శకులు నితిన్, భరత్

మే 17 నుంచి కామాక్షితాయి బ్రహ్మోత్సవాలు

● శాస్త్రోక్తంగా స్తంభ ప్రతిష్ఠ

బుచ్చిరెడ్డిపాళెం, ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి): మండలంలోని జొన్నవాడ మల్లికార్జున స్వామి, కామాక్షితాయి ఆలయంలో మే 17 నుం చి 27వ తేదీ వరకు శ్రీవార్ల ఆలయ వార్షిక బ్రహ్మోత్స వాలు నిర్వ హించనున్నారు. అం దుకు శుభ ముహూర్తం గా బుధవారం ఉదయం ఆలయ ముఖ మం డపం వద్ద పండితులు వేదమం త్రాలతో శాస్త్రో క్తంగా స్తంభ ప్రతిష్ఠ చేశారు. తొలుత పుణ్యాహ వచనం, గణపతి పూజ, అనంతరం స్వామి, అమ్మవార్లకు పూజలు నిర్వహించారు. ఈ కార్యక్ర మంలో ఆలయ ఈఓ ఏవీ. శ్రీనివాసులురెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.



ఆలయ ముఖ మండపంలో స్తంభ ప్రతిష్ఠ పూజలు చేస్తున్న పండితులు, ఈవో

పండ్లను మగ్గబెట్టేందుకు

నిషేధిత రసాయనాలు వాడితే చర్యలు

● జాయింట్ కలెక్టర్ కార్తీక్

నెల్లూరు(హరనాథపురం), ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి) : పండ్లను మగ్గబెట్టడానికి నిషేధిత రసాయనాలు వాడితే చర్యలు తప్పవని జాయింట్ కలెక్టర్ కార్తీక్ హెచ్చరించారు. కలెక్టరేట్ లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి బుధవారం ఆయన జిల్లా స్థాయి కమిటీ సభ్యులతో కలిసి జూమ్ కాన్ఫరెన్స్ నిర్వహించారు. పండ్లను కృత్రిమంగా మగ్గబెట్టడంలో కాల్షియం కార్బైడ్‌ను నిరోధించాలని సూచించారు. ఈ విషయమై ఆహార భద్రత విభాగం అధికారులు తరచూ తనిఖీలు చేయాలని ఆదేశించారు.



కిసాన్ డ్రోన్ల వినియోగంపై మాట్లాడుతున్న జాయింట్ కలెక్టర్ కార్తీక్

డ్రోన్లను సద్వినియోగం చేసుకోవాలి

నెల్లూరు(వ్యవసాయం): సాంకేతికతను రైతులకు అందించే చర్యల్లో భాగంగా ప్రభుత్వం డ్రోన్లను అందుబాటులోకి తీసుకొచ్చిందని వాటిని రైతులు సద్వినియోగం చేసుకోవాలని జేసీ పిలుపునిచ్చారు. కలెక్టరేట్‌లోని తిక్కన ప్రాంగణంలో బుధవారం వ్యవసాయంలో కిసాన్ డ్రోన్ల వినియోగం, ఉపయోగాలపై రైతులకు అవగాహన సదస్సు జరిగింది. ఆయన మాట్లా డుతూ పురుగు మందులు పిచికారీ చేయడంలో రైతులు ఎంతో వ్యయ ప్రయాసలకు గురవుతున్నారని, డ్రోన్ల వినియోగంతో ఖర్చు తగ్గుతుందని సమయం కూడా ఆదా అవుతుందని చెప్పారు. ఒక్కో డ్రోన్ రూ.10 లక్షలు ఉంటుందని దీనిలో 80 శాతం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సబ్సిడీ ఇస్తున్నాయని తెలిపారు. బ్యాంకులు రుణ సదుపాయం కూడా అందిస్తా యని చెప్పారు. రైతులు ఐదుగురు బృందంగా ఏర్పడి దీనిని సద్వినియోగం చేసుకోవాలని సూచిచారు. జిల్లా వ్యవసాయాధికారి పీ సత్యవాణి మాట్లా డుతూ జిల్లాలో 41 సంఘాలకు డ్రోన్లు అందించేందుకు ఎంపిక చేసినట్లు చెప్పారు. 11 మందికి డ్రోన్ ఆపరేటగింగ్‌పై పైలట్ శిక్షణ కూడా పూర్తిచేసినట్లు తెలిపారు. ఈ సమావేశంలో లీడ్ బ్యాంకు మేనేజర్ శ్రీకాంత్ ప్రదీప్, వ్యవసాయశాఖ ఏడీఏలు నర్సోజీరావు, శేషగిరి, ఏవో మంజుల తదితరులు పాల్గొన్నారు.

సోనియా, రాహుల్‌పై కేసులకు కాంగ్రెస్ నిరసన

నెల్లూరు (వైద్యం), ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి) : కాంగ్రెస్ పార్టీ జాతీయ నేతలు సోనియాగాంధీ, రాహుల్‌గాంధీలపై ఈడీ అక్రమ కేసులు బనాయిం చిందంటూ ఆ పార్టీ నాయకులు బుధవారం నెల్లూరులోని ఎఫ్‌సీఐ కార్యాల యం ఎదుట నిరసన తెలిపారు. నల్ల జెండాలతో అంబేడ్కర్ విగ్రహం వద్ద కూడా ఆందోళన చేపట్టారు. పార్టీ నెల్లూరు రూరల్ ఇన్‌చార్జి షేక్ ఫయాజ్, జిల్లా కిసాన్ సంఘ్ అధ్యక్షుడు ఏటూరి శ్రీనివాసులరెడ్డి మాట్లాడుతూ మాజీ ప్రధాని జవహర్ లాల్ నెహ్రూతోపాటు 500 మంది స్వాతంత్ర్య సమరయోధులు కలిసి నేషనల్ హెరాల్డ్ పత్రికను స్థాపించారన్నారు. కాంగ్రెస్ పార్టీ అధినాయకత్వాన్ని చూసి భయపడిన బీజేపీ అధిష్టానం అక్రమ కేసులు బనాయిస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ కార్యక్ర మంలో నాయకులు సంజయ్‌కుమార్, హుస్సేన్‌బాషా, కిశోర్‌బాబు, ఇర్ఫాన్, మల్లికార్జునరెడ్డి, సుధీర్ తదితరులు పాల్గొన్నారు.



ఎఫ్‌సీఐ కార్యాలయం ఎదుట నిరసన తెలుపుతున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు

వెంకటాచలం, ఏప్రిల్ 16 (ఆంధ్ర జ్యోతి): విక్రమ సింహపురి యూనివర్సిటీ పరిధిలోని అనుబంధ కళాశాలలో బుధవారం జరిగిన

డిగ్రీ పరీక్షలకు 614 మంది గైర్హాజరు

డిగ్రీ రెండవ సెమిస్టర్ పరీక్షలలో 614 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు వీఎస్‌యూ పరీక్షల నిర్వాహణాధికారి డాక్టర్ ఆర్ మధుమతి ఒక ప్రకటనలో తెలిపారు. మధ్యాహ్నం జరిగిన పరీక్షలలో 8665 మంది విద్యార్థులకు గాను 8051 మంది హాజరయ్యారు.

లారీ పైనుంచి కింద పడి

క్లీనరు మృతి



లారీ క్లీనర్ మృతదేహం

కోవూరు, ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి): స్థానిక ఫెడోరా సంస్థ సమీపంలో బుధవారం లారీకి పట్ట కప్పుతుండగా ప్రమాదవశాత్తు కింద పడి లారీ క్లీనర్ మృతి చెందాడు. వివరాల మేరకు.. ముంబై నుంచి రొయ్యల మేతతో బయలుదేరిన లారీ మంగళవారం రాత్రి ఫెడోరా కంపెనీకి చేరుకుంది. రాత్రి సమయంలో పట్ట తొలగించి రొయ్యల మేత శాంపిల్‌ను ఫెడోరా సిబ్బంది తీసుకున్నారు. బుధవారం ఉదయం ఒక్కసారిగా ఈదురు గాలులు, వర్షం రావడంతో క్లీనర్ కరన్ మోహన్ గైకోవాడ్ అప్రమత్తమై లారీకి పట కప్పేందుకు ప్రయత్నించాడు. ఈ క్రమంలో ప్రమాదవశాత్తు కింద పడడం, ఈదురు గాలులతో పట్ట శరీరంపై పడటంతో తీవ్రగాయాలయ్యాయి. క్షతగాత్రుడిని చికిత్స నిమిత్తం నెల్లూరు నగరంలోని ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ విషయాన్ని తెలుసుకున్న వీఆర్వో కోడూరు శ్రీనివాసులురెడ్డి పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఎస్ఐ రంగనాథ్‌గౌడ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. లారీ క్లీనరు మహారాష్ట్ర పరిధిలోని ధానే వెస్ట్ దుపర్‌గోడ్‌చాట్ ప్రాంతవాసిగా గుర్తించారు. అదే ప్రాంతానికి చెందిన లారీ డ్రైవరు ఎవతె సుభాష్‌ను పోలీసులు విచారించారు.

12 మద్యం సీసాల స్వాధీనం

కావలి రూరల్, ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి): కావలి పట్టణం వైకుంఠపురంలో నిర్వహిస్తున్న బెల్టు దుకాణంపై బుధవారం ఎక్సైజ్ పోలీసులు దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో అక్రమంగా మద్యం విక్రయాలు సాగిస్తున్న పులుసు నాగేశ్వరరావును అదుపులోకి తీసుకుని అతని వద్ద నుంచి 12 మద్యం సీసాలు స్వాధీనం చేసుకున్నట్లు సీఐ శ్రీనివాసులు తెలిపారు. ఈ దాడుల్లో ఎస్‌ఐలు దేవిక, ఎస్‌కె బాషావలి, సిబ్బంది పాల్గొన్నారు.

డ్వామా క్వాలిటీ కంట్రోల్ అధికారి సస్పెన్షన్

నెల్లూరు(జడ్పీ), ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి): గత వైసీపీ ప్రభుత్వం హయాంలో చేసిన పాపాలు ప్రస్తుతం అధికారులకు మెడకు చుట్టుకుంటున్నాయి. జగనన్న లేఅవుట్ల చదునులో అక్రమాలకు సంబంధించి తాజాగా డ్వామా సీనియర్ క్వాలిటీ కంట్రోల్ అధికారి సతీష్‌పై సస్పెన్షన్ వేటు పడింది గత వైసీపీ ప్రభుత్వంలో జగనన్న లేఅవుట్ల చదును పేరుతో భారీగా అవినీతి చోటుచేసుకుంది. దీనిపై పెద్దఎత్తున ఫిర్యాదులు రావటంతో ప్రభుత్వం విచారణ చేపట్టింది. జిల్లాలో నాలుగు బృందాలను ఏర్పాటు చేసి డ్వామా క్వాలిటీ కంట్రోల్ ఇంజనీరు ఆధ్వర్యంలో విచారణ జరిపించింది. విచారణ అధికారి అయిన సతీష్ విచారణను సక్రమంగా చేయకుండా, ఎక్కడా అవినీతి, అక్రమాలు జరగలేదని నివేదికలను ఇచ్చాడు. దీంతో అనుమానాలు వ్యక్తం కావటంతో ఆయన చేసిన విచారణపై చీఫ్ క్వాలిటీ కంట్రోల్ అధికారి ప్రత్యేకంగా జిల్లాకు వచ్చి మళ్లీ విచారణ చేపట్టారు. దీంతో సతీష్ తప్పుడు నివేదికలు ఇచ్చారని తేల్చి, ఆయనపై సస్పెన్షన్ వేటు వేశారు.ఈ విషయం ఆశాఖలో చర్చనీయాంశం అయింది.

బంగారంతో పరారైన వ్యక్తి అరెస్ట్

● 108 గ్రాముల బంగారం స్వాధీనం

నెల్లూరు(క్రైం), ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి) : బంగారం కరిగించుకొని వస్తానని నమ్మబలికి బంగారం తీసుకొని పరారైన వ్యక్తిని సంతపేట పోలీసులు అరెస్ట్ చేశారు. ఆ స్టేషన్‌లో బుధవారం నిందితుడి వివరాలను నగర ఇన్‌చార్జి డీఎస్పీ ఘట్టమనేని శ్రీనివాసరావు మీడియాకు వెల్లడించారు. నగరంలోని జెండావీధికి చెందిన షేక్ నిజాం కొరడావీధిలో బంగారు దుకాణం నిర్వహిస్తున్నారు. ఆయన వద్ద జనార్దనరెడ్డి కాలనీకి చెందిన షేక్ మన్సూర్ సంవత్సర కాలంగా నమ్మకంగా పనిచేస్తున్నాడు. గతనెల 8వ తేదీన నిజాం 130 గ్రాముల బంగారాన్ని కరిగించుకొని రమ్మని మన్సూర్‌కు ఇచ్చారు. ఆ బంగారంతో మన్సూర్ పరారయ్యాడు. బాధితుడి ఫిర్యాదుతో సంతపేట ఇన్‌స్పెక్టర్ దశరథరామారావు ఆధ్వర్యంలో ఎస్ఐ బాలకృష్ణ కేసు నమోదు చేసి ప్రత్యేక బృందాలతో దర్యాప్తు జరిపారు. మంగళవారం రంగనాయకులపేట రైల్వేగేటు వద్ద నిందితుడు మన్సూర్‌ను అరెస్ట్ చేసి అతని వద్ద నుంచి 108 గ్రాముల బంగారాన్ని స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసులో ప్రతిభ చూపిన ఇన్‌స్పెక్టర్, ఎస్ఐ, సిబ్బంది వెంకటేశ్వర్లు, సుబ్బారావు, మల్లికార్జునయ్య, అల్లాభక్షు, వెంకటేశ్వర్లు, గోపి, శ్రీకాంత్‌ను డీఎస్పీ అభినందించారు.



నిందితుడి వివరాలు తెలుపుతున్న డీఎస్పీ శ్రీనివాసరావు

కాలువలోకి దూసుకెళ్లిన కారు

● ఒకరి మృతి, మరొకరికి గాయాలు

నెల్లూరు(క్రైం), ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి) : సినీ ఫక్కీలో కారు కల్వర్టును ఢీకొని సమీపంలోని కాలువలోకి దూసుకెళ్లిన ఘటన బుధ వారం నెల్లూరు నగర శివా ర్లలోని జాతీయ రహదారిపై చోటు చేసుకుంది. పోలీసుల సమాచారం మేరకు... నగరం లోని బీవీనగర్‌కు చెందిన పీ భాస్కర్‌రెడ్డి (51) రియల్ ఎస్టేట్ వ్యాపారి. బుధవారం స్నేహితుడైన బీవీ నగర్‌కు చెందిన శ్రీనివాసులుతో కలిసి కారులో చింతారెడ్డిపాళెం వెళ్లారు. అక్కడ ఓ స్థలాన్ని చూసి జాతీయ రహదారిపై ఇంటికి వస్తుండగా ప్రమాదవశాత్తు కారు కల్వర్టును ఢీకొని సమీపంలోని కాలువలోకి దూసుకెళ్లింది. కారు నడుపుతున్న భాస్కర్‌రెడ్డి అక్కడిక క్కడే మృతి చెందగా శ్రీనివాసులుకు గాయాలయ్యాయి. స్థానికులు 108 అంబు లెన్స్‌లో ఇద్దరిని జీజీహెచ్‌కు తరలించి సౌత్ ట్రాఫిక్ పోలీసులకు సమాచారం అందించారు. ఇన్‌స్పెక్టర్ వెంకటరెడ్డి ఘటనా స్థలాన్ని పరిశీలించారు. బాధిత కుటుంబానికి సమాచారమిచ్చారు. మృతదేహాన్ని జీజీహెచ్ మార్చురీకి తరలించి, శ్రీనివాసులు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. భాస్కర్‌రెడ్డికి భార్య లక్ష్మీభవాని, ఇద్దరు కుమారులు ఉన్నారు.



భాస్కర్‌రెడ్డి మృతదేహం

డీఎస్సీని వెంటనే ప్రకటించాలి

● డీవైఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి రామన్న ● నగరంలో నిరసన ప్రదర్శన

నెల్లూరు (వైద్యం), ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో ఉపాధ్యాయ నియామకాలకు సంబం ధించి డీఎస్సీ నోటిఫికేషన్‌ను తక్షణం ప్రకటిం చాలని డీవైఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి జీ రామన్న డిమాండ్ చేశారు. డీఎస్సీ విడుదల చేయాలంటూ బుధవారం నెల్లూరులో అంబేడ్కర్ విగ్రహం నుంచి కలెక్టరేట్ వరకు డీవైఎఫ్ఐ నిరసన ప్రదర్శన చేపట్టింది. ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడిన వెంటనే డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేస్తామని హామీ ఇచ్చారని, కానీ నేటికీ దానిని నెరవేర్చలేదని విమర్శించారు. రాబోయే విద్యా సంవత్సరం ప్రారంభానికి ఉపాధ్యాయ నియామకాలు చేపడతామని విద్యాశాఖ మంత్రి లోకేష్ చెబుతున్నారని, ఇప్పటివరకు నోటిఫికేషన్ విడుదల చేయకుండా నియామకాలు ఎలా చేపడతారని ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి రమణ, జిల్లా అధ్యక్షుడు నరసింహం, రూరల్ కన్వీనర్ చైతన్య, జగదీష్, ఫయాజ్, శేఖర్, మహేష్, వినోద్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



నిరసన ప్రదర్శన నిర్వహిస్తున్న డీవైఎఫ్ఐ శ్రేణులు

అపార్ట్‌మెంట్‌లో వ్యభిచార కేంద్రం

నెల్లూరు(క్రైం), ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి) : అపార్ట్‌మెంట్‌లో నిర్వహిస్తున్న వ్యభిచార కేంద్రంపై బాలాజీనగర్ పోలీసులు దాడిచేసి నిర్వాహకురాలితోపాటు విటుడిని అరెస్ట్ చేశారు. వివరాలను బుధవారం ఇన్‌స్పెక్టర్ కే సాంబశివరావు మీడియాకు వెల్లడించారు. బాపట్ల జిల్లాకు చెందిన శివకుమారి నెల్లూరులోని హరనాథపురం ఎక్స్‌టెన్షన్ ఏరియాలో ఉన్న ఓ అపార్ట్‌మెంట్‌లో కొద్దిరోజుల కిందట ఫ్లాట్‌ను అద్దెకు తీసుకుంది. వివిధ ప్రాంతాల నుంచి సెక్స్‌వర్కర్లను తీసుకువచ్చి గుట్టుచప్పుడు కాకుండా వ్యభిచార కేంద్రం నిర్వహిస్తోంది. సమాచారం అందుకున్న బాలాజీనగర్ ఇన్‌స్పెక్టర్ కే సాంబశివరావు మంగళవారం రాత్రి తన సిబ్బందితో కలిసి దాడి చేశారు. నిర్వాహకురాలితోపాటు విటుడు నెల్లూరుకు చెందిన మహేష్‌ను అరెస్ట్ చేశారు. ఇద్దరు సెక్స్‌వర్కర్లను అదుపులోకి తీసుకుని హోంకు తరలించారు.



విజయవాడలో బుధవారం జరిగిన ఓ కార్యక్రమంలో పర్యాటక, సాంస్కృతికశాఖ మంత్రి కందుల దుర్గేష్ నుంచి కందుకూరి పురస్కారాలను అందుకుంటున్న జిల్లాకు చెందిన డాక్టర్ బద్రి వీరకుమార్ (సాంఘికం), గంధం రాజేశ్వరి (పౌరాణికం), కనిమెల భానుమతి (చారిత్రకం)

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో (రూ.లలో)
బాయిలర్ లైవ్	119
స్కిన్ చికెన్	214
స్కిన్‌లెస్	236

కోడిగుడ్ల ధర (100): 415

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)

ఒక గ్రాము ధర	రూ.9128
వెండి కిలో ధర	రూ. 99,600
వెండి ఒక గ్రాము	రూ.102.60

పార్కులు సిద్ధం చేయండి : కమిషనర్

నెల్లూరు(సిటీ), ఏప్రిల్ 16, (ఆంధ్రజ్యోతి) : పిల్లలకు స్కూల్ సెలవులు వస్తున్నాయి... వారు ఆడుకునేందుకు, సేద తీరేందుకు నగరంలోని పార్కులన్నింటినీ సిద్ధం చేయాలని కార్పొరేషన్ కమిషనర్ సూర్యతేజ, ఏపీ గ్రీనరీ బ్యూటిఫికేషన్ కార్పొరేషన్ ఎండీ శ్రీనివాసులు అధికారులను ఆదేశించారు. బుధవారం కార్పొరేషన్ కార్యాలయంలో నిర్వహించిన సమీక్షలో వారు మాట్లాడారు. నగరంలో 45 పార్కులుండగా వాటిల్లో 23 పార్కులకు ఎస్‌క్యాప్ ద్వారా మౌలిక సదుపాయాలు కల్పించే పనులు వేగంగా జరుగుతున్నాయని చెప్పారు. ఈ కార్యక్రమంలో అధికారులు, కాంట్రాక్టర్లు పాల్గొన్నారు. కాగా, 17వ డివిజన్‌లోని పలు ప్రాంతాల్లో పారిశుధ్య పనులను కమిషనర్ పరిశీలించారు.

న్యూస్ బాక్స్

జీజీహెచ్ వద్ద సీఐటీయూ అంబులెన్స్ సేవలు

నెల్లూరు (వైద్యం), ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో సీఐటీయూ ఆధ్వర్యంలో ఉచిత అంబులెన్స్ సేవలు అందుబాటులోకి తెచ్చినట్లు నగర మాజీ డిప్యూటీ మేయర్, సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు మాదాల వెంకటేశ్వర్లు తెలిపారు. బుధవారం జీజీహెచ్ ఎదుట రెండు అంబులెన్స్‌లను ఆయన ప్రారంభించారు. ఆసుపత్రికి వచ్చే నిరుపేదల కోసం వీటిని ఏర్పాటు చేశామని చెప్పారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ రూరల్ అధ్యక్షకార్యదర్శులు కొండా ప్రసాద్, పెంచల నర్సయ్య, సతీష్ కుమార్, సందానీ బాషా, సాయికుమార్ తదితరులు పాల్గొన్నారు.

అన్న క్యాంటీన్‌కు విరాళం

నెల్లూరు(హరనాథపురం), ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి) : అన్న క్యాంటీన్ చారిటబుల్ ట్రస్టుకు నగరానికి చెందిన వీజీడీ కృపాల్ రూ.5వేలు విరాళం అందచేశారు. ఆయనకు అన్న క్యాంటీన్ మేనేజింగ్ ట్రస్టీ-కార్యదర్శి డాక్టర్ పీ సంపత్ కుమార్ అభినందన లేఖ పంపారు. భారత సేవా ఫౌండేషన్ కార్యదర్శి షేక్ ఖాసీం అన్న క్యాంటీన్‌కు ఇస్తున్న విరాళాన్ని స్ఫూర్తిగా తీసుకుని తాను కూడా విరాళం ఇచ్చినట్లు కృపాల్ తెలిపారు.

కళాపకర్షణ పూజలు పూర్తి

నెల్లూరు (సాంస్కృతికం), ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి) : రాజరాజేశ్వరి ఆలయంలో కలిశ పునః ప్రతిష్ఠ, ధ్వజస్తంభ కళాపకర్షణ పూజలు బుధవారంతో ముగిశాయి. కంచి ఆస్థాన సిద్ధాంతి లక్కవఝ్జుల విజయ సుబ్రహ్మణ్యం సిద్ధాంతి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాలు జరిగాయి. నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి దంపతులు, ఎస్ఎస్ కన్‌స్ట్రక్షన్స్ అధినేతలు ఆల్తూరి గిరీష్‌రెడ్డి, లత, మహేష్‌రెడ్డి, రాధిక దంపతులు ఉభయకర్తలుగా వ్యవహరించారు. దేవదాయ జిల్లా సహాయ కమిషనర్ కోవూరు జనార్దన్‌రెడ్డి, సిబ్బంది పర్యవేక్షించారు. రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, సతీమణి సుజితమ్మ, కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి, భానుశ్రీ, కార్పొరేటర్ చెక్క అహల్య, సునీల్ తదితరులు పాల్గొన్నారు. కాగా, ఉస్మాన్‌సాహెబ్‌పేట కోదండరామస్వామి ఆలయ బ్రహ్మోత్సవాల్లో బుధవారం ఉదయం తీర్థ వాది, పట్టాభిషేకం జరిగాయి. రాత్రి గజ వాహనంలో పేట ఉత్సవం వైభవంగా జరిగింది.

అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన

పొదలకూరు, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఆచార్య అపార్ట్‌మెంట్, గేట్ సెంటర్ వద్ద బుధవారం అగ్నిమాపక వారోత్సవాలు నిర్వహించారు. పొదలకూరు అగ్నిమాపక అధికారి టి విజయవరకుమార్ ఆధ్వర్యంలో ప్రమాదాల నివారణపై అవగాహన కల్పించారు. గ్యాస్ సిలిండర్ నుంచి మంటలు చెలరేగితే ఎలా అదుపు చేయాలో ప్రయోగాత్మకంగా వివరించారు.

ఆటో డ్రైవర్‌పై దాడి

● పోలీసులకు ఫిర్యాదు



నెల్లూరు ప్రభుత్వ అసుపత్రిలో చికిత్స పొందుతున్న జనార్ధన్

వెంకటాచలం, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): వెంకటాచలంలోని సర్వేపల్లి క్రాస్ రోడ్డు వద్ద ఆటో డ్రైవర్‌పై మంగళవారం సాయంత్రం ఒక వ్యక్తి దాడి చేసి తీవ్రంగా గాయపరిచాడు. ఈమేరకు బాధితుడు బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. బాధితుడి కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. గూడూరుకు చెందిన జనార్ధన్ తన ట్రక్‌ఆటోలో టెంకాయల లోడుతో గొలగమూడి నుంచి గూడూరుకు జాతీ య రహదారిపై వెళ్తున్నాడు. సర్వేపల్లి నుంచి నెల్లూరు వైపు వెళ్తున్న కారు సర్వేపల్లి క్రాస్ రోడ్డు వద్ద రహదారిపై మలుపు తిరుగుతుండగా అదే సమయంలో రహదారిపై వస్తున్న జనార్ధన్ తన ట్రక్‌ఆటోను ఒక్కసారిగా నిలిపాడు. దీంతో కారులో నుంచి ఒక వ్యక్తి దుర్భాషలాడుతూ దిగి ఆటోలో ఉన్న జనార్ధన్ చేతిని ఆటో కిటికీ అద్దంలో పెట్టి విరిచేశాడు. ఆసమయంలో కొద్ది దూరంలోనే పోలీస్ వాహనంతో సహా ఇద్దరు పోలీసులు నిల్చుని ఉండడంతో దాడి చేసిన వ్యక్తి కారు వేసుకుని వెళ్లిపోయాడు. క్షతగాత్రుడిని చికిత్స నిమిత్తం నెల్లూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఆప్రాంతంలో ఉన్న సీసీ కెమెరాల ఆధారంగా తనపై దాడి చేసిన వ్యక్తిని అదుపులోకి తీసుకోవాలని బాధితుడు కోరుతున్నాడు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

పొన్నవాహనంపై వేణుగోపాలుడు



నెల్లూరు (సాంస్కృతికం), ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని మూలాపేట వేణుగోపాలస్వామి ఆలయంలో జరుగుతున్న బ్రహ్మోత్సవాల్లో బుధవారం ఉదయం ముసుగుల సేవ జరిగింది. స్వామి, అమ్మవార్ల మధ్య ప్రణయ కలహోత్సవాన్ని అర్చకులు వ్యాఖ్యాన సహితంగా వివరించారు. సాయంత్రం పూలంగిసేవ అనంతరం పొన్నవాహనంలో నగరోత్సవం వైభవంగా జరిగింది.

నయనానందకరంగా పుష్పయాగం

నగరంలోని శబరి శ్రీరామక్షేత్రంలో బ్రహ్మోత్సవాల ముగింపు సందర్భంగా బుధవారం రాత్రి పుష్పయాగం నయనానందకరంగా జరిగింది. గురుకృపా కళాక్షేత్రం సురభి గాయత్రి శిష్య బృందం నృత్యాంజలి నిర్వహించారు. ఉభయకర్తలుగా నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ప్రశాంతిరెడ్డి వ్యవహరించారు.

ఆంజనేయస్వామికి దవనోత్సవం

సంతపేట ఆంజనేయస్వామి ఆలయ బ్రహ్మోత్సవాలు బుధవారం రాత్రి ముగిశాయి. మూలవర్లకు పూలంగిసేవ, దవనోత్సవం జరిగాయి. ఈవో రఘురామయ్య పర్యవేక్షించారు.

స్టేడియంలో సోలార్ విద్యుత్ వెలుగులు



స్టేడియంలో అమర్చిన సోలార్ విద్యుత్ దీపాలు

నెల్లూరు(విద్య), ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని ఏసీ సుబ్బారెడ్డి స్పోర్ట్స్ కాంప్లెక్స్ ప్రాంగణంలో హై పవర్ ఎల్‌ఈడీ సోలార్ స్ట్రీట్ లైట్స్ ఏర్పాటు చేశారు. సెన్సార్ సిస్టం ద్వారా పని చేసే ఈ సోలార్ లైట్లు సూర్యరశ్మిలో విద్యుత్‌ను స్వీకరించి చీకటి సమయంలో వాటంతట అవే వెలిగేలా ఏర్పాటు చేశారు. ముత్తుకూరు మండలం నేలటూరులోని సదరన్ గ్లోబల్ ఎనర్జీ సంస్థ సహకారంతో స్టేడియం అంతటా 125 సోలార్ విద్యుత్ దీపపు స్తంభాలు ఏర్పాటు చేశారు. బుధవారం నాటికి వీటి అమరిక పూర్తవడంతో మైదానమంతా వెలుగు పరుచుకుంది. సౌర విద్యుద్దీపాలను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ స్టేడియంలో కాంతికి ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకుంటామని డీఎస్‌డీవో యతిరాజ్ తెలిపారు.

మహిళ రక్షణకే 'శక్తి' : రూరల్ డీఎస్పీ శ్రీనివాసరావు

నెల్లూరు రూరల్, ఏప్రిల్ 16, (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం మహిళల రక్షణ కోసం 'శక్తి' యాప్‌ను ప్రతిష్టాత్మకంగా తీసుకువచ్చిందని నెల్లూరు రూరల్ డీఎస్పీ ఘట్టమనేని శ్రీనివాసరావు తెలిపారు. ఆ యాప్‌పై మండలంలోని సౌత్‌మోపూరు వాణిశ్రీ జిల్లా పరిషత్ హైస్కూల్లో బుధవారం విద్యార్థులకు అవగాహన కల్పించారు. డీఎస్పీ మాట్లాడుతూ బాలికలు, మహిళలు ఎలాంటి ప్రతికూల పరిస్థితుల్లో ఉన్నప్పటికీ శక్తి యాప్ ద్వారా సమాచారం పోలీసులకు అందించవచ్చన్నారు. దీని వల్ల సమీప ప్రాంత పోలీసులు క్షణాల్లో సదరు ఘటన స్థలికి చేరుకుని రక్షణగా నిలుస్తారని తెలిపారు. ఈ యాప్‌ను ప్రతీ మహిళ తన సెల్‌ఫోన్లో ఇన్‌స్టాల్ చేసుకోవాలని సూచించారు. అనంతరం ఐసీడీఎస్ అధికారులు లక్ష్మీదేవి, కమల విద్యార్థులకు గుడ్‌టచ్ - బ్యాడ్‌టచ్, పోక్సో చట్టాలపై అవగాహన కల్పించారు. కాగా, మాదకద్రవ్యాల వాడకాన్ని ప్రోత్సహించం అంటూ విద్యార్థులు ప్రమాణపత్రాలను డీఎస్పీకి అందచేశారు. ఈ కార్యక్రమంలో సీఐ గుంజి వేణు, పీహెచ్‌సీ వైద్యుడు రవీంద్రారెడ్డి, ప్రభుత్వ కళాశాల ప్రిన్సిపల్ విజయలక్ష్మి, శక్తి టీం ఇన్‌చార్జి సుబ్బరాజు, హైస్కూల్ హెచ్ఎం అన్వర్‌బాషా, టీడీపీ నేత ప్రదీప్ పాల్గొన్నారు.



సీఐకు ప్రమాణపత్రాలు అందజేస్తున్న విద్యార్థినులు

అంతర్ కళాశాల క్రికెట్ పోటీల ప్రారంభం

● పలు జిల్లాల నుంచి తరలివచ్చిన జట్లు



క్రీడాకారులతో గంటా రవితేజ, నిర్వాహకులు

నెల్లూరు (వైద్యం), ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని నారాయణ వైద్య కళాశాల క్రీడా ప్రాంగణంలో అంతర్ కళాశాలల క్రికెట్ పోటీలు బుధవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. నారాయణ వైద్య కళాశాలల డైరెక్టర్ గంటా రవితేజ వీటిని ప్రారంభించి ప్రసంగించారు. విద్యార్థులకు చదువుతోపాటు క్రీడలు ఎంతో అవసరమన్నారు. ప్రత్యేకించి వైద్య విద్యార్థుల్లో ఇలాంటి పోటీలు నూతనోత్తేజాన్నిస్తాయని చెప్పారు. రాష్ట్ర వ్యాప్తంగా 38 వైద్య, డెంటల్ కళాశాలల జట్లు ఈ పోటీల్లో పాల్గొంటున్నాయని తెలి పారు. ఈ కార్యక్రమంలో వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీనివాసులు రెడ్డి, డాక్టర్ ఎన్టీఆర్ హెల్త్ యూనివర్సిటీ స్పోర్ట్ కమిటీ చైర్మన్ డాక్టర్ త్రిమూర్తి, నారాయణ డెంటల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ అజయ్ రెజినాల్డ్, ఓఎస్‌డీ సాంబశివరావు, ఆపరేషన్స్ హెచ్‌డీ రామారావు, క్యాంపస్ ఇన్‌చార్జి మునిశంకర్, టోర్నమెంట్ కార్యనిర్వాహక కార్యదర్శి సెల్విబాబు తదితరులు పాల్గొన్నారు. కాగా, తొలిరోజు పోటీలు హోరాహోరీగా జరిగాయి. పలు కళాశాలల జట్లు ప్రతిభ చాటి విజయం సాధించాయి.

'నారాయణ'లో గ్రాడ్యుయేషన్ డే

నెల్లూరు(విద్య), ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని రామలింగాపురంలో ఉన్న నారాయణ కాన్సెప్ట్ పాఠశాలలో బుధవారం గ్రాడ్యుయేషన్ డే వేడుకలు నిర్వహించారు. విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ప్రాథమిక పాఠశాల నుంచి ప్రాథమికోన్నత పాఠశాలకు బదిలీ అయిన విద్యార్థులకు గ్రాడ్యుయేషన్ పట్టాలను అందచేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల డీన్ డీ నరేంద్ర, ప్రైమరీ సెంట్రల్ కోఆర్డినేటర్లు ప్రసన్న, దీప్తి, ప్రిన్సిపాళ్లు ఏ వెంగళరావు, సోని, వైస్ ప్రిన్సిపాళ్లు విజయలక్ష్మి, ఫాతిమా పాల్గొన్నారు.



'మెడికవర్'లో అరుదైన శస్త్రచికిత్స

● ఐదేళ్ల చిన్నారిని కాపాడిన వైద్య నిపుణులు



విలేకరుల సమావేశంలో డాక్టర్ కౌసిక్‌రెడ్డి, ఇతర వైద్యనిపుణులు

నెల్లూరు (వైద్యం), ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని మెడికవర్ ఆసుపత్రిలో అత్యంత అరుదైన శస్త్రచికిత్స జరిగింది. ప్రాణాపాయ స్థితిలో ఉన్న ఐదేళ్ల చిన్నారిని వైద్య నిపుణులు కాపాడారు. ఈ సందర్భంగా ఆసుపత్రిలో బుధవారం ఏర్పాటు చేసి న విలేకరుల సమావేశంలో పల్మనాలజిస్ట్ డాక్టర్ కాటంరెడ్డి కౌసిక్‌రెడ్డి, డాక్టర్ ఉదయ్‌కీర్తి, డాక్టర్ రంగనాథ్ మాట్లాడారు. కావలికి చెందిన సత్య(5) అనే పాప తీవ్రమైన ఆయాసం, జ్వరంతో మాట్లాడలేని స్థితిలో ఆసుపత్రికి వచ్చిందన్నారు. పరీక్షలు నిర్వహించగా ఎడమ ఊపిరితిత్తిలో వక్క ఇరుక్కుందని గుర్తించామన్నారు. ఇలాంటి కేసుల్లో బాధితులు మరణిస్తారని, అయితే ఫ్లెక్సిబుల్ బ్రాంకోస్కోపి అనే అధునాతన శస్త్రచికిత్స చేసి చిన్నారి ప్రాణాలు కాపాడామని చెప్పారు. ఈ కార్యక్రమంలో పాప తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఇంటర్‌లో 'కేపీసీ' విద్యార్థులకు ఉత్తమ ఫలితాలు



విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ శ్రీనివాసులు రెడ్డి, అధ్యాపకులు

నెల్లూరు(విద్య), ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి) : ఇంటర్మీడియట్ పరీక్షల్లో నగరంలోని కేపీసీ ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించారని ఆ కాలేజీ ప్రిన్సిపాల్ సీహెచ్ శ్రీనివాసులు రెడ్డి తెలిపారు. కళాశాలలో బుధవారం జరిగిన అభినందన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. సీనియర్ ఎంపీసీలో ఎస్‌కే ఫర్హానా 973, బైపీసీలో పీ లలిత 950, హెచ్‌ఈసీలో పీ యోషిక 946, సీఈసీలో ఎస్‌కే ఉస్మాన్ 806 మార్కులు సాధించారని చెప్పారు. ఒకేషనల్ కోర్సుల్లో సీనియర్ సీఎస్ఈలో ఎస్‌కే అక్బర్ 978 మార్కులు సాధించాడన్నారు. జూనియర్ ఎంపీసీలో కే రాజేశ్వరి 449, సీఈసీలో కీర్తన 457, ఒకేషనల్ విభాగంలో కే జయంతి 486, కే భువనేశ్వరి 485 మార్కులు సాధించారని తెలిపారు., సమష్టి కృషితోనే ఈ ఫలితాలు సాధించామ న్నారు. అర్హులైన అధ్యాపకులతో బోధన, విద్యార్థులందరికీ ఉచితంగా పాఠ్యపుస్తకాలు, మధ్యాహ్న భోజనం కూడా అందచేస్తున్నామని, దీనిని అందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

పర్యావరణాన్ని పరిరక్షించాలి

● అటవీ రేంజర్ మాల్యాద్రి

నెల్లూరు(విద్య), ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థి దశ నుంచే పర్యావరణంపై అవగాహన పెంచుకుని దానిని పరిరక్షించేందుకు అందరూ కృషి చేయాలని అటవీ రేంజర్ మాల్యాద్రి పిలుపునిచ్చారు. ఏపీ నేషనల్ గ్రీన్ కోర్, పర్యావరణ విద్య సౌజన్యంతో జిల్లా నుంచి ఎంపిక చేసిన పాఠశాలల విద్యార్థులతో బుధవారం నగరవనంలో నేచర్ క్యాంప్ నిర్వహించారు. వివిధ వృక్షజాతులు, వాటి ప్రత్యేకతలను విద్యార్థులకు తెలియచేసి చిత్రలేఖన పోటీలు నిర్వహించారు. విజేతలకు సర్టిఫికెట్లు, బహుమతులు అందజేశారు. తర్వాత విద్యార్థులకు గుడ్డ సంచులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా సైన్స్ అధికారి డీ కరుణాకర్‌రెడ్డి, నేషనల్ గ్రీన్‌కోర్ జిల్లా కోఆర్డినేటర్ కే భక్తవత్సలబాబు నాయుడు, జీవశాస్త్ర ఉపాధ్యాయుడు హరిబాబు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యం

● ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి



సిమెంటు రోడ్డును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి

కోవూరు, ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కారానికి తమ ప్రభుత్వం ప్రాధాన్యతనిస్తోందని ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి అన్నారు. పట్టణంలోని పలు సీసీ రోడ్లను ఆమె బుధవారం ప్రారంభించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నిత్యం ప్రజల మధ్యనే నిలచి పని చేయాల్సిందిగా శాసనసభ్యులకు సూచించారని చెప్పారు. ఎన్నో ఏళ్లుగా పరిష్కారానికి నోచుకోని చక్కెర కర్మాగారం కార్మికులకు బకాయిలను కూటమి ప్రభుత్వం చెల్లించిందన్నారు. గ్రామీణ యువతకు ఉపాధి కల్పించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని చెప్పారు. అనంతరం మైథిలి కూడలిలో మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ తుమ్మలపెంట పార్వతి, పెన్నాడెల్టా చైర్మన్ జెట్టి రాజగోపాలరెడ్డి, టీడీపీ నాయకులు ఇంతా మల్లారెడ్డి, ముసలి సుధాకర్, బాలా రవి, జనసేన నాయకులు గాదిరాజు అశోక్‌కుమార్, చప్పిడి శ్రీనివాసులురెడ్డి తదితరులు పాల్గొన్నారు.

యంత్రకాయ మిట్ట కాలువ ఆక్రమణల తొలగింపులో ఉద్రిక్తత

● టీడీపీ, వైసీపీ నేతల వాగ్వాదం ● మౌనం పాటించిన అధికారులు



ఆక్రమణల తొలగింపును అడ్డుకుంటున్న జడ్పీటీసీ తుమ్మల లక్ష్మయ్య, అతని అనుచరులు

విడవలూరు, ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి): మండలంలోని యంత్రకాయ మిట్ట కాలువ ఆక్రమణ తొలగింపులలో బుధవారం ఉద్రిక్తత నెలకొంది. టీడీపీ నాయకులు దిలీప్ అతని అనుచరులు, వైసీపీ జడ్పీటీసీ తుమ్మల లక్ష్మయ్య అనుచరులు మధ్య వాగ్వాదం జరిగింది. అయితే రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులు తమకు ఏమి పట్టనట్లు వ్యవహరించారు. గాదెలదిన్నె పంచాయతీలో సుమారు 160 ఎకరాలకు సాగునీరు అందించే కాలువను వైసీపీకి చెందిన జడ్పీటీసీ తుమ్మల లక్ష్మయ్య అనుచరులు ఆక్రమించుకుని ధాన్యం బస్తాలు వేశారు. ఈ విషయాన్ని ఆంధ్రజ్యోతి దిన పత్రికలో ఈనెల 10న నీటిపారుదల ఆక్రమణ కథనానికి జిల్లా అధికారులతో పాటు కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి, మండల ఇన్‌చార్జి అడపాల శ్రీధర్‌రెడ్డి స్పందించారు. రైతులకు ప్రయోజనకరంగా కాలువలో ఉన్న ఆక్రమణలను తొలగించాలన్నారు. ఈమేరకు తహసీల్దారు చంద్రశేఖర్, ఇరిగేషన్ డీఈ పెంచలయ్య, ఏఈ సురేష్‌లు పరిశీలించి కాలువ తవ్వుతున్న సమయంలో జడ్పీటీసీ తుమ్మల లక్ష్మయ్య, కుటుంబసభ్యులు, అనుచరులు తవ్వకాలను అడ్డుకున్నారు. గ్రామంలో అనేక ఇరిగేషన్ కాలువలు ఆక్రమణలకు గురయ్యాయని వాటిని తవ్విన తరువాత యంత్రకాయ మిట్ట కాలువలో తవ్వకాలు జరగాలని అధికారులతో వాదనకు దిగారు. దీంతో వైసీపీ, టీడీపీ నాయకుల మధ్య వాగ్వాదం జరిగింది. ఈ విషయంపై జిల్లాధికారులకు ఫిర్యాదు చేయనున్నట్లు టీడీపీ నాయకులు తెలిపారు. ఈ సందర్భంగా ఇరిగేషన్ డీఈ పెంచలయ్య మాట్లాడుతూ రెవెన్యూ అధికారుల సర్వే చేసి నివేదిక అందజేస్తే ఆక్రమణలను తొలగిస్తామని తెలిపారు.

అగ్ని ప్రమాదాలపై అప్రమత్తంగా ఉండాలి

రాపూరు, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): అగ్ని ప్రమాదాలపై అప్రమత్తంగా ఉండాలని అగ్నిమాపక సిబ్బంది ప్రజలకు సూచించారు. అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా బుధవారం పట్టణంలోని పలు వార్డుల్లో అగ్ని ప్రమాదాల నివారణపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఓ కుప్పయ్య, ఎల్ఎఫ్‌లు శ్రీనివాసులు, సుధాకర్ వర్ధన్, నారాయణ, ఎఫ్ఎంలు వెంకటేశ్వర్లు, అబ్దుల్ బాసీద్, శ్రీనాథ్ పాల్గొన్నారు.

సీఎం సహాయనిధి చెక్కుల పంపిణీ

నెల్లూరు(హరనాథపురం), ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి): కోవూరు నియోజక వర్గంలోని 23 మంది అనారోగ్య పీడితులకు రూ.3.31 లక్షల విలువైన ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను బుధవారం ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి ఆమె నివాసంలో అందచేశారు. ప్రజల ఆరోగ్య పరిరక్షణకు కూటమి ప్రభుత్వం తొలి ప్రాధాన్యత ఇస్తోందని చెప్పారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకుడు బెజవాడ వంశీకృష్ణారెడ్డి, పెన్నాడెల్టా చైర్మన్ జెట్టి రాజగోపాల్ రెడ్డి, నాయకులు రావెల వీరేంద్ర నాయుడు తదితరులు పాల్గొన్నారు.

పల్లెపాడులో జాగ్తే రహో భారత్ యాత్ర

ఇందుకూరుపేట, ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి): మహిళల భద్రత బాలికలపై లైంగిక దాడులను అరికట్టేందుకు చేపట్టిన జాగ్తే రహో భారత్ యాత్ర బుధవారం పల్లెపాడులోని పినాకినీ సత్యాగ్రహ గాంధీ ఆశ్రమానికి చేరింది. ఈ సందర్భంగా కార్యక్రమం నిర్వాహకుడు రాజేంద్రప్రసాద్ యాదవ్ ఆశ్రమ కో కన్వీనర్ నెల్లూరు రవీంద్రరెడ్డితో కలసి మహాత్మాగాంధీ, పొనక కనకమ్మ విగ్రహాలకు ఖాదీ వస్త్రాలు, నూలుమాలలు, పట్టు వస్త్రాలు సమర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ భారత దేశమంతా ఈ యాత్ర చేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆశ్రమ కమిటీ సభ్యులు గణేశం సుమంత్‌రెడ్డి, యాత్ర ప్రచార బోధకులు, ఆశ్రమ మేనేజర్ మనోజ్, తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వివాహిత మృతి

నెల్లూరు(క్రైం), ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి) : భర్త వేధింపులు తట్టుకోలేక ఆత్మహత్యకు యత్నించిన మహిళ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందింది. పోలీసుల సమాచారం మేరకు... నెల్లూరులోని మనుమసిద్ది నగర్‌కు చెందిన యశోద (28), రామకోటయ్య నగర్‌కు చెందిన సాగర్ తొమ్మిదేళ్ల కిందట ప్రేమ వివాహం చేసుకున్నారు. వారికి ఇద్దరు సంతానం. ప్రస్తుతం వారు రామకోటయ్య నగర్‌లో నివసిస్తున్నారు. సాగర్ ప్రైవేటు బస్సు కండక్టర్‌గా, యశోద తెలుగుగంగ క్వార్టర్స్ ఎదురుగా ఉన్న పెట్రోలు బంకులో పనిచేస్తూ జీవనం సాగిస్తున్నారు. అనుమానంతో సాగర్ నిత్యం భార్యను వేధిస్తూ ఉండేవాడు. ఆత్మహత్య చేసుకోమని పదేపదే బాధించేవా డని యశోద తల్లి సుమతికి చెప్పుకుని కన్నీరు పెట్టుకునేది. ఈనెల 14వ తేదీ దంపతుల మధ్య గొడవ జరిగింది. దీంతో మన స్థాపానికి గురైన యశోద పురుగుల మందు తాగింది. సాగర్ ఆమెను చికిత్స నిమిత్తం జీజీహెచ్‌లో చేర్పించి భార్య తల్లి దండ్రులకు సమాచారం అందించాడు. అక్కడ చికిత్స పొందు తూ బుధవారం యశోద మృతి చెందింది. తల్లి సుమతి ఫిర్యా దుతో వేదాయపాళెం ఇన్‌స్పెక్టర్ వీ శ్రీనివాసులురెడ్డి కేసు నమోదు చేసి మృతదేహాన్ని మార్చురీకి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

పోషణ్ పక్వాడాను సద్వినియోగం చేసుకోవాలి

పొదలకూరు, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): పిల్లలు, గర్భిణులు, బాలింతలలో రక్తహీనత తొలగించేందుకు ప్రభుత్వం ప్రవేశపెట్టిన పోషణ్ పక్వాడాను సద్వినియోగం చేసుకోవాలని ఐసీడీఎస్ సీడీపీవో విజయలక్ష్మీ సూచించారు. బుధవారం పొదలకూరు మండలంలోని అయ్యగారిపాలెం అంగన్‌వాడీ సెంటర్‌లో అంగన్‌వాడీ కార్యకర్తలతో పోషణ్ పక్వాడాపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చిన్నారులకు ముర్రుపాలు ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ సూపర్‌వైజర్ పద్మ, అంగన్‌వాడీ కార్యకర్తలు జీ జయలక్ష్మీ, కల్యాణి, జయంతి, చెన్నమ్మ, పెంచలమ్మ, గర్భిణులు, బాలింతలు, తదితరులు పాల్గొన్నారు.

వేంకటేశ్వరస్వామికి తలనీలాలు ఇవ్వడం తప్పా ?

● జనసేన పార్టీ సమన్వయకర్త బొబ్బేపల్లి

వెంకటాచలం, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి) : డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ సతీమణి అన్నా లెజినోవ తన బిడ్డ ప్రాణాలను కాపాడిన వేంకటేశ్వరస్వామికి తలనీలాలు ఇవ్వడం తప్పా అని సర్వేపల్లి నియోజకవర్గ జనసేన పార్టీ సమన్వయకర్త బొబ్బేపల్లి సురేష్ నాయుడు ప్రశ్నించారు. స్థానిక పార్టీ కార్యాలయంలో బుధవారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. పవన్ కల్యాణ్ కుటుంబంపై అసత్యా ఆరోపణలు చేస్తే ఊరుకునేది లేదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ డైరెక్టర్ గుమ్మినేని వాణిభవాని, జనసేన మండల ప్రధాన కార్యదర్శి కాకి శివ కుమార్, కార్యదర్శి సందూరి శ్రీహరి, చల్లా చెంచయ్య, మణి పాల్గొన్నారు.

స్మైలీ ఆత్మహత్యపై పోలీసు స్టేషన్ ఎదుట ఆందోళన

నెల్లూరు రూరల్, ఏప్రిల్ 16, (ఆంధ్రజ్యోతి) : కుల వేధింపులతో స్మైలీ అనే వివాహిత బలవన్మరణానికి పాల్పడ్డ ఘటనలో నిజానిజాలుతేల్చాలని డిమాండ్ చేస్తూ ఆమె కుటుంబ సభ్యులు బుధవారం నెల్లూరు రూరల్ పోలీసు స్టేషన్ ఎదుట ఆందోళనకు దిగారు. తన కుమార్తెది సహజ మరణం కాదని, అనుమానాలున్నాయని ఆమె తల్లి మల్లిక పోలీసులకు ఫిర్యాదు చేశారు. అల్లుడు నాగూరుబాబు, అతని కుటుంబ సభ్యులు నిత్యం కులం పేరుతో స్మైలీని వేధించేవారని ఆరోపించారు. దీనిపై సీఐ వేణును వివరణ కోరగా స్మైలీ పోస్టుమార్టం నివేదిక వస్తే తప్ప పూర్తి వివరాలు తెలియవని చెప్పారు. కాగా, స్మైలీకి పోస్టుమార్టం నిర్వహించే జీజీహెచ్ వద్ద కూడా కుటుంబ సభ్యులు ఆందోళనకు దిగారు.

పీజీఆర్ఎస్‌ని తప్పుదోవ పట్టిస్తున్న అధికారులు

విడవలూరు, ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కారానికి టీడీపీ ప్రభుత్వం ప్రతి సోమవారం నిర్వహిస్తున్న ప్రజా విజ్ఞప్తుల దినోత్సవాన్ని అధికారులు తప్పుదోవ పట్టిస్తున్నారని చౌకిచర్ల గ్రామానికి చెందిన టీడీపీ కార్యకర్త గర్త్తేటి హరిప్రసాద్ ఆరోపించారు. విడవలూరులో బుధవారం జరిగిన విలేకర్ల సమావేశంలో అయన మాట్లాడుతూ చౌకిచర్లలో ఉపాధి హామీ పథకంలో ఫీల్డ్ అసిస్టెంట్ అవకతవకలు చేసినట్లు గత నెల 16న కలెక్టరేట్‌లో జరిగిన గ్రీవెన్స్‌లో ఫిర్యాదు చేశామన్నారు. వారం రోజుల క్రితం ఎంపీడీవో నగేష్‌కుమారి తనకు ఎటువంటి ముందస్తు సమాచారం ఇవ్వకుండా ఫీల్డ్ అసి స్టెంట్‌పై విచారణ చేశారన్నారు. తన బంధువుని పిలిచి అతనిచే సంతకం చేయించుకుని సమస్యని పరిష్క రించినట్లు జిల్లా అధికారులకు నివేదిక పంపారన్నారు. ఈ సమావేశంలో టీడీపీ కార్యకర్తలు సుధాకర్, సుమన్ పాల్గొన్నారు.

స్పోర్ట్స్ డే టెక్ ఫెస్ట్ ప్రారంభం

కొడవలూరు, ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి): మండలంలోని నార్తురాజుపాలెంలో ఉన్న ఎస్వీ గ్రూపు విద్యా సంస్థల ఆవరణలో ఏజీయూఐఎల్‌ఏ-2025 టెక్ ఫెస్ట్ సందర్భంగా ఎన్‌ఎస్ఎస్ యూనిట్, ఎన్‌సీసీ క్రీడా విభాగం పర్యవేక్షణలో బుధవారం మొదటి రోజున స్పోర్ట్స్ డే టెక్ ఫెస్ట్ ప్రారంభించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సీ.ప్రకాష్‌రావు తెలిపారు. కళాశాల చైర్మన్ డాక్టర్ పీ.గుణశేఖర్ జాతీయ పతాక ఆవిష్కరించి జ్యోతి ప్రజ్వలన చేశారు. అనంతరం ఖోఖో, కబడ్డీ, పరుగు పందాలు, తదితర క్రీడలను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎన్‌సీసీ కేర్ టేకర్ ఆఫీసర్ సీహెచ్.సతీష్, ఫిజికల్ డైరెక్టర్లు యాసిన్, ఫణికుమార్, ఎన్‌ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ పి.రవికుమార్, కళాశాల ఏవో కె.గిరీష్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

మట్టి మాఫియాతో
గుండె 'చెరువు'

కారిజాత చెరువును తవ్వేసిన అక్రమార్కులు





సూళ్లూరుపేటలో ఓ వెంచర్‌కు రాత్రివేళ ట్రాక్టరులో తరలుతున్న మట్టి

- ఆగని వైసీపీ నాయకుల ఆగడాలు
- రాత్రివేళ భారీగా అక్రమ రవాణా

సూళ్లూరుపేట, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): తమ ప్రభుత్వం మారినా వైసీపీ నాయకుల మట్టి అక్రమ రవాణా ఆగలేదు. సాగునీటి చెరువులే లక్ష్యంగా చెలరేగిపోతున్నారు. రెండు వారాల నుంచి గోపాల్ రెడ్డిపాలెం చెరువు, తడ మండలం కారిజాత చెరువుల్లో భారీగా మట్టి తవ్వేస్తున్నారు. చీకటిపడ్డాక సూళ్లూరుపేటలోని ఇళ్లప్లాట్లు, కొత్త వెంచర్లకు ట్రాక్టర్లలో మట్టి తరలిస్తున్నారు. ఈ చెరువుల మట్టికి గిరాకీ ఉండడంతో పది అడుగుల మేర తవ్వేయడం ఆందోళన కలిగిస్తోంది. తవ్వకాల వల్ల చెరువులో పెద్ద ఎత్తున గుంతలు ఏర్పడుతున్నాయని రైతులు ఆవేదన చెందుతున్నారు. వర్షాకాలంలో కట్టకు ప్రమాదమేర్పడుతుందంటున్నారు. వైసీపీ నాయకుల తవ్వకాలకు అధికార పార్టీ నాయకుడొకరి అండదండలు ఉన్నాయనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.కారిజాత రోడ్డు నుంచి శ్రీహరికోట మార్గంలో రాత్రిపూట మట్టి ట్రాక్టర్లు జోరందుకుంటున్నాయి..

పట్టించుకోని అధికారులు

చెరువుల గర్భాన్ని తొలిచేస్తున్నా ఇరిగేషన్, రెవెన్యూ పోలీసు అధికారులు పట్టించుకోవడంలేదు. కళ్లెదుటే మట్టి అక్రమ రవాణా జరుగుతున్నా వీరు మౌనం దాల్చడం వెనుక ఆంతర్యం అంతుబట్టడం లేదు. రైతులు సొంతపొలంలో మట్టి తీయాలన్నా అనుమతులు కావాలనే అధికారులు ఏకంగా చెరువుల్లో మట్టిని తవ్వి తరలిస్తున్నా కిమ్మనడం లేదు. ఇకనైనా అక్రమ రవాణాకు అడ్డుకట్టవేయాలని బాధిత రైతులు కోరుతున్నారు.



చెరువులో మట్టిని తవ్వేందుకు ఏర్పాటు చేసుకున్న రోడ్డు



ఈ ప్రశ్నలకు బదులేది?



"తులాభారం ద్వారా వచ్చిన సొమ్ము బ్యాంకుల ద్వారా స్వామి ఖజానాకు వెళ్లాల్సింది పోయి కొంతమంది చేతుల్లోకి వెళ్లింది. దీనిపై విచారణ చేపట్టి కొందరు తాత్కాలిక ఉద్యోగులను మాత్రమే తొలగించారు. వాళ్లని జైలుకు ఎందుకు పంపలేదు? ఆ కోట్లాది డబ్బు ఏమైంది? మీ ఇంట్లో కోటి రూపాయలు పోతే కేసులు పెట్టకుండా ఉంటారా? దేవుడికో న్యాయం, మీకో న్యాయమా? దీనిపై మౌనం వెనుక ఏముంది? 2019 ముందు ఏమీ లేని వాళ్ల కోట్లాది రూపాయలకు ఎలా పడగలెత్తారు? గోవులు చనిపోయాయంటూ రాజకీయం చేస్తున్నవారు సమాధానం చెప్పాలి."

\- టీటీడీ బోర్డు సభ్యుడు భానుప్రకాష్‌రెడ్డి

స్వార్థరాజకీయాల కోసం గోశాలను ఎన్నుకోవద్దు



"స్థానికంగా ఉండేవారు ఎవరైన కొండకు యాత్రీకులు పెరిగే విధంగా ప్రయత్నించాలి. అంతేకానీ విషప్రచారంతో భయపెట్టకూడదు. రాజకీయంగా ఏదైనా ఉంటే వేరే అంశాలతో విభేదించండి. చర్చాగోష్ఠిల్లో సవాళ్లు విసురుకోండి. స్వార్థరాజకీయాల కోసం గోశాలను ఎన్నుకోకూడదు.మన వ్యవస్థలను మనమే ధ్వంసం చేయకూడదు."

\- సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ

మార్టిగేజ్ రద్దుకు లంచం అడుగుతున్నారు

- రైతు ఫిర్యాదుతో సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి వచ్చిన ఎమ్మెల్యే
- 16 రోజులుగా తిప్పించుకుంటారా అంటూ ఆగ్రహం
- ఉన్నతాధికారులకు ఫిర్యాదు

శ్రీకాళహస్తి, ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి): 'నా భూమి మార్టిగేజ్ రద్దుకు 16 రోజులుగా తొట్టంబేడు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం చుట్టూ తిరుగుతున్నా. అధికారులు లంచం కోసం వేధిస్తున్నారు' అంటూ ఓ రైతు బుధవారం ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డికి ఫోన్ ద్వారా ఫిర్యాదు చేశారు. దీంతో తొట్టంబేడు సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయానికి వచ్చిన ఎమ్మెల్యే.. అధికారులపై ఆగ్రహం వ్యక్తంచేశారు. దీనిపై సమగ్ర విచారణ జరిపి చర్యలు తీసుకోవాల్సిందిగా కలెక్టర్, రెవెన్యూ మంత్రికి ఫోనుచేసి కోరారు. వివరాలిలా ఉన్నాయి. కేవీబీపురం మండలం గురుకుల కండ్రిగకు చెందిన విశ్రాంత వీఆర్వో, రైతు జనార్దన్‌రెడ్డి తన భూమిని మార్టిగేజ్ చేసి రుణం పొందాడు. ఇటీవల రుణం కట్టేసిన ఆయన మార్టిగేజ్ రద్దుకోసం ఒకటో తేది నుంచి తొట్టంబేడు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి తిరుగుతున్నారు. 4న మార్కెట్ వాల్యూ సర్టిఫికెట్‌కు దరఖాస్తు చేసి వారం తర్వాత తీసుకున్నారు. మార్టిగేజ్ రద్దుకోసం రూ.1,500 చలానా, స్పెషల్ స్టాంపు తదితరాలు సిద్ధం చేసుకుని మంగళవారం వచ్చారు. బ్యాంకు అధికారులు రాలేదు. బుధవారం వచ్చిన జనార్దన్‌రెడ్డి.. లంచం కోసం మార్టిగేజ్ రద్దు ఆలస్యం చేస్తున్నారంటూ ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డికి ఫోన్ ద్వారా ఫిర్యాదు చేశారు. పీఆర్ అతిథి గృహంలో వినతి పత్రాలు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే.. వెంటనే సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి చేరుకున్నారు. లంచం కోసం సిబ్బంది వేధిస్తున్నారని సబ్‌రిజిస్ట్రార్‌కు చెబితే దురుసుగా మాట్లాడారని, ఓ రైటర్ రూ.3,400 తీసుకున్నారంటూ ఎమ్మెల్యేకి రైతు చెప్పారు. చిన్నపాటి మార్టిగేజ్ రద్దుకు ఇన్ని రోజులు తిప్పించుకోవడం ఏంటని సుధీర్‌రెడ్డి ప్రశ్నించారు. ఇక్కడ అవినీతికి పాల్పడుతున్నారంటూ 30మందికిపైగా తనకు ఫిర్యాదు చేశారన్నారు. అందుకనే తిరుపతిలో రిజిస్ట్రేషన్లు చేసుకుంటున్నట్లు తన సన్నిహితులు చెప్పారని ఆగ్రహించారు. ఎమ్మెల్యేకి వాటాలివ్వాలంటూ తన పేరు చెప్పి ఎలా వసూలు చేస్తారంటూ నిలదీశారు. అలాంటి ప్రచారం తానెప్పుడూ చేయలేదని సబ్‌రిజిస్ట్రార్ సుధాకర్ జవాబిచ్చారు. ఆ తర్వాత కలెక్టర్ వెంకటేశ్వర్, రెవెన్యూశాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్‌కు ఎమ్మెల్యే ఫోన్ చేసి ఫిర్యాదు చేశారు.



తొట్టంబేడు సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

అందరు ఎమ్మెల్యేలూ ఇలా చేస్తే.. : 'తొట్టంబేడు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంపై చాలా ఫిర్యాదులు వస్తుండటంతో అవినీతికి అంతం పలకాలని మెరుపువేగంతో స్పందించాను. దీనిపై చర్యలు తీసుకోవాలి. సీఎంచంద్రబాబు, యువనేత లోకేశ్ స్ఫూర్తితో రాష్ట్ర వ్యాప్తంగా ఎమ్మెల్యేలందరూ ఇలా అవినీతి ఆరోపణలున్న కార్యాలయాలపై ఆకస్మిక తనిఖీలు చేసి లంచాలను అరికట్టాలని కోరుతున్నా' అని సుధీర్‌రెడ్డి మీడియాతో అన్నారు. ఎమ్మెల్యే స్పందించిన తీరు సంతోషంగా ఉందని రైతు జనార్దన్‌రెడ్డి తెలిపారు. ఎందుకు జాప్యం జరిగిందనే దానిపై విచారిస్తున్నాం అని సబ్‌రిజిస్ట్రార్ సుధాకర్ చెప్పారు.

ప్రభుత్వ భూముల్లో ఇల్లు కట్టుకున్నారా!

- క్రమబద్ధీకరణకు అవకాశం
- జీవో నెంబరు 30ను సద్వినియోగం చేసుకోండి
- వాగు వంకల్లో కట్టుంటే అవకాశం లేదు
- కలెక్టర్ వెంకటేశ్వర్ వెల్లడి

తిరుపతి(కలెక్టరేట్), ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి): అభ్యంతరంలేని ప్రభుత్వ భూముల్లో పేదలు ఆక్రమించుకుని ఇల్లు కట్టుకుని ఉంటే వాటి క్రమబద్ధీకరణకు ప్రభుత్వం అవకాశం కల్పించిందని కలెక్టర్ వెంకటేశ్వర్ పిలుపునిచ్చారు. దీనికోసం మార్గదర్శకాలు విడుదల చేసిందన్నారు. దీనిని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కలెక్టరేట్‌లో బుధవారం జేసీ శుభం బన్సల్‌తో కలిసి ఆయన మీడియాతో మాట్లాడుతూ, ఇల్లు కట్టుకున్న వారు పట్టా కోసం దరఖాస్తు చేసుకుంటే క్రమబద్ధీకరించి మంజూరు చేస్తామన్నారు. 2019 అక్టోబరు 15కంటే ముందు ఆక్రమిత స్థలాల్లో ఇల్లు నిర్మించుకుని ఉండాలన్నారు. 150 చదరపు గజాల్లోపు ఆక్రమించి ఇల్లు కట్టుకున్న వారికి ఉచితంగా క్రమబద్ధీకరించి ఇంటి పట్టా మంజూరు చేస్తామన్నారు. 150 నుంచి 300 చదరపు గజాల్లోపు అయితే బీపీఎల్ (దారిద్ర్య రేఖకు దిగువ) వారు 15శాతం బేసిక్ వాల్యూ, 50శాతం రిజిస్ట్రేషన్ ఫీజు.. ఏపీఎల్ వారు 15 శాతం రిజిస్ట్రేషన్ బేసిక్ వాల్యూ, యధావిధిగా రిజిస్ట్రేషన్ ఫీజు చెల్లించాలన్నారు. 301 నుంచి 450 చదరపు గజాలకు సంబంధించి బీపీఎల్ వారికి వంద శాతం బేసిక్ వాల్యూ 50 శాతం రిజిస్ట్రేషన్ ఫీజు చెల్లించాలన్నారు. ఏపీఎల్ వారు 200 శాతం బేసిక్ వాల్యూ, యధావిధిగా రిజిస్ట్రేషన్ ఫీజు.. 451చదరపు గజాలపైన ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమించి నివాసం ఉన్నవారెవరైనా సరే బేసిక్ వాల్యూపై 5రెట్లు చెల్లిస్తూ రిజిస్ట్రేషన్ ఫీజు చెల్లిస్తే క్రమబద్ధీకరిస్తామన్నారు. ఈ ఏడాది డిసెంబరు 31 లోపు గ్రామ, వార్డు సచివాలయాల్లో, తహసీల్దారు కార్యాలయాల్లో దరఖాస్తులు సమర్పిస్తే ఆ ప్రాంతంలోని వీఆర్వో, వార్డు అధికారులు విచారించి ఆయా ప్రాంతాలను బట్టి, తహసీల్దారు, ఆర్డీవో, మున్సిపల్ కమిషనర్లకు నివేదికలు ఇస్తారని తెలిపారు. వాటిని సబ్‌డివిజన్ కమిటీలో చర్చించి ఆమోదిస్తామన్నారు. రెండేళ్ల తర్వాత లబ్ధిదారులకు ఆ భూములపై శాశ్వత హక్కులు కల్పిస్తామని చెప్పారు. ఆ ప్రాంతంలో తాము నివసిస్తున్నట్లు ఆధారాలుగా రిజిస్టర్ డాక్యుమెంట్, ఇంటిపన్ను, కరెంటు బిల్లు, నీటిపన్నులో ఏదో ఒకటి సమర్పించాలన్నారు. ఇప్పటి వరకు ఈ పథకానికి 955 దరఖాస్తులు అందినట్లు కలెక్టర్ వెంకటేశ్వర్ తెలిపారు. ఇంటి స్థలాల క్రమబద్ధీకరణకు ఎంపికైన వారు ప్రభుత్వం నిర్దేశించిన ఫీజులను రెండు వాయిదాల్లో చెల్లించేలా వెసులుబాటు కల్పించినట్లు తెలిపారు.

వీళ్లకు అవకాశం లేదు

మాస్టర్‌ప్లాన్ రోడ్లు, జోనల్‌ప్లాన్‌లో నిర్దేశిత స్థలాలు, లేఅవుట్ స్థలాలు, పంట పోరంబోకులు, కాలువ పోరంబోకు, నదీ పరివాహక ప్రాంతాల్లో ఆక్రమించి ఉంటే క్రమబద్ధీకరణ సాధ్యం కాదని కలెక్టర్ స్పష్టం చేశారు.



మీడియాతో మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటేశ్వర్, పక్కన జేసీ శుభం బన్సల్

యూఎస్‌లో స్టేట్ మంత్రిగా చంద్రగిరివాసి

చంద్రగిరి, ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి): చంద్రగిరికి చెందిన బద్రి లంకెళ్ళ ఇటీవల అమెరికాలోని విస్కాన్‌సిన్ స్టేట్‌లోని మాడిసన్ డిస్ట్రిక్-7లో ఆల్డర్ పర్సన్‌గా 53.8 శాతం ఓట్లతో ఎన్నికయ్యారు. మంగళవారం ఆయన ఆ స్టేట్ మంత్రిగా ప్రమాణ స్వీకారం చేసినట్లు ఆయన కుటుంబ సభ్యులు తెలిపారు. చంద్రగిరికి చెందిన టీడీపీ నాయకురాలు లంకెళ్ళ లలిత, శ్రీరాముల కుమారుడు బద్రి విస్కాన్‌సింగ్ స్టేట్‌లోని మాడిసన్ డిస్ట్రిక్-7లో సుమారు పాతికేళ్లుగా ఉన్నారు. ఇటీవల ఎన్నికల్లో ఆయన ఆల్డర్ పర్సన్‌గా ఎన్నికయ్యారు.తాజాగా నాలుగు శాఖలకు మంత్రిగా బాధ్యతలు చేపట్టడంపై చంద్రగిరిలో పలువురు సన్నిహితులు బద్రిని ఫోన్లో అభినందించారు.



బద్రి లంకెళ్ళ

'కొండ'పైకి డ్రోన్ ఎలా తీసుకెళ్లారు?

- అలిపిరి టోల్‌గేట్‌లో ఎస్పీ తనిఖీలు



టోల్‌గేట్ వద్ద తనిఖీలు నిర్వహించి సిబ్బందికి సూచనలు చేస్తున్న ఎస్పీ

తిరుపతి(నేరవిభాగం), ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి): తిరుమలలో డ్రోన్ కలకలం నేపథ్యంలో టీటీడీ సీవీఎస్వో (ఎఫ్ఏసీ) హోదాలో బుధవారం ఎస్పీ హర్షవర్ధనరాజు అలిపిరి టోల్‌గేట్ వద్ద ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. 'ఇటీవల తిరుమలకు డ్రోన్ ఎలా తీసుకెళ్లగలిగారు? తనిఖీలు ఎందుకు చేయలేదు? టోల్‌గేట్ వద్ద సిబ్బంది ఎందుకంత నిర్లక్ష్యంగా పనిచేస్తున్నారు' అంటూ ఆగ్రహం వ్యక్తంచేశారు. టోల్‌గేట్ నుంచి తిరుమలకు ఏవైనా నిషేధిత వస్తువులు వెళ్లినట్లు తెలిస్తే సంబంధిత సిబ్బందిపై చర్యలు తప్పవని హెచ్చరించారు. వాహనాలు, లగేజీలు ఎలా తనిఖీచేస్తున్నారు. లగేజీ స్కాన్ చేయడానికి ఎంత సమయం పడుతుందనేది పరిశీలించారు. ప్రతి ఇమేజ్‌ను క్షుణంగా పరిశీలించాలని టోల్‌గేట్ స్కానర్ మానిటర్ వద్ద సిబ్బందిని ఆదేశించారు. అనుమానమున్న వస్తువులను ఫిజికల్‌గా తనిఖీ చేయాలన్నారు.

నేడు జిల్లాకు 16వ ఆర్థిక కమిషన్ రాక

తిరుపతి(కలెక్టరేట్), ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి) : 16వ ఆర్థిక కమిషన్ చైర్మన్ డాక్టర్ అరవింద్ పనగారియా 15మంది సభ్యులతో కలిసి గురువారం తిరుపతికి రానున్నట్లు కలెక్టర్ వెంకటేశ్వర్ తెలిపారు. కలెక్టరేట్‌లో బుధవారం సంబంధిత అధికారులతో వర్చువల్ విధానంలో సమీక్షించారు. ఉదయం 11.30 గంటలకు వచ్చి తాజ్ హోటల్‌లో విశ్రాంతి తీసుకుంటారని పేర్కొన్నారు. మధ్యాహ్నం 2.30 గంటలకు రూరల్, 3.15 గంటలకు అర్బన్ స్థానిక సంస్థల ప్రతినిధులతో కలెక్టరేట్‌లో సమావేశమవుతారని తెలిపారు. 4 గంటలకు వాణిజ్య, పరిశ్రమల ప్రతినిధులతో సమావేశం ఉంటుందన్నారు. రాత్రి 7.30 గంటలకు తిరుమల చేరుకుని శుక్రవారం తెల్లవారుజామున శ్రీవారి దర్శించుకుని తిరుగు ప్రయాణమవుతారన్నారు. అధికారులు సమన్వయంతో సమావేశాలను విజయవంతం చేయాలని కోరారు. జేసీ శుభం బన్సల్, తిరుపతి మున్సిపల్ కమిషనర్ మౌర్య, డీఆర్వో నరసింహులు, ఆర్డీవోలు తదితరులు పాల్గొన్నారు.

డిజిటల్ బ్యాంకింగ్‌పై అవగాహన కల్పించండి

తిరుపతి(కలెక్టరేట్), ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): డిజిటల్ బ్యాంకింగ్ సేవలను విస్తృతం చేసి, ప్రజలకు అవగాహన కల్పించాలని బ్యాంకర్లకు కలెక్టర్ వెంకటేశ్వర్ సూచించారు. బుధవారం కలెక్టరేట్‌లో నాబార్డు రూపొందించిన రుణ ప్రణాళికను ఆయన ఆవిష్కరించారు. 2025-26 ఆర్థిక సంవత్సరానికి జిల్లా నాబార్డు రుణ ప్రణాళిక రూ.18,032.41కోట్లతో రూపొందించినట్లు తెలిపారు. బ్యాంకింగ్ యాప్‌లు, ఇంటర్నెట్ బ్యాంకింగ్ వంటి సేవలపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో నాబార్డు జిల్లా మేనేజరు సునీల్, ఎల్డీఎం విశ్వనాథరెడ్డి పాల్గొన్నారు.

ప్రైవేటు పాఠశాలల్లో ఉచిత సీట్లకు దరఖాస్తుల ఆహ్వానం

తిరుపతి(విద్య), ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): ప్రైవేటు, అన్‌ఎయిడెడ్ పాఠశాలల్లో 2025-26 సంవత్సరానికిగాను ఉచిత సీట్ల కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు డీఈవో కేవీఎన్ కుమార్ బుధవారం తెలిపారు. విద్యాహక్కు చట్టం-2009 ప్రకారం బలహీన వర్గాల పిల్లలకు ఎయిడెడ్, ప్రైవేటు పాఠశాలల్లో 1 నుంచి 5వ తరగతి విద్యార్థులకు 25 శాతం సీట్లను ఉచితంగా కేటాయిస్తోంది. ఈ ఏడాది మార్చి 31 నాటికి ఐదేళ్లు పూర్తిచేసుకున్న విద్యార్థులు ఈనెల 28 నుంచి వచ్చేనెల 15వ తేదీలోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చు. విద్యార్థుల ఆధార్ ద్వారా cse.ap.gov.in వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలి. అన్నింటినీ పరిశీలించిన తరువాత విద్యాసంవత్సరం ప్రారంభంలోపు రాష్ట్ర ప్రభుత్వం అర్హులైన బలహీన వర్గాల పిల్లలకు ఉచిత సీట్లను కేటాయిస్తుంది. ఇతర సమాచారం కోసం డీఈవోను లేదా టోల్‌ఫ్రీ నెంబరు 18004258599లో సంప్రదించవచ్చు.

హిందీ భాష అమలెలా ఉంది?



తిరుపతి (విశ్వవిద్యాలయాలు), ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): యూజీసీ పరిధిలోని రాజ భాషా సమితి సభ్యులు తిరుపతిలోని జాతీయ సంస్కృత యూనివర్సిటీలో బుధవారం పర్యటించారు. బోధన, పరిశోధన, పాలనా రంగాల్లో హిందీ భాష అమలు తీరును పరిశీలించారు. ఈ బృందంలో డాక్టర్ అశోక్ కుమార్, వి.కె.సుదర్శనదేవి ఉన్నారు. యూనివర్సిటీలోని అన్ని అంశాల్లో హిందీ భాషను పటిష్ఠంగా అమలు చేస్తున్నట్టు వారికి వీసీ ప్రొఫెసర్ కృష్ణమూర్తి వివరించారు.

రివర్స్ గేర్‌లో సూళ్లూరుపేట డిపో

గ్రామాల గడప తొక్కని పల్లె వెలుగులు ● రూ.9 కోట్ల మేర నష్టాల బాటలో పయనం

సూళ్లూరుపేట, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర సరిహద్దులోని సూళ్లూరుపేట డిపో రివర్స్ గేర్‌లో పయనిస్తోంది. డిపోను ఆదాయ మార్గాల్లో నడిపించాల్సిన అధికారులు కార్యాలయానికే పరిమితమవడంతో పాలన పూర్తిగా గాడితప్పింది. ఒకప్పుడు ఆదాయార్జనలో రాష్ట్రంలో ప్రథమస్థానంలో నిలిచిన సూళ్లూరుపేట డిపో నేడు ఏకంగా రూ.9 కోట్ల మేర నష్టాలను మూటగట్టుకొంది.

నాడు 54 సర్వీసులతో ప్రారంభం..

ఆంధ్ర, తమిళనాడు రాష్ట్రాల సరిహద్దులోని సూళ్లూరుపేట ఆర్టీసీ డిపోను 1999 ఏప్రిల్ 16న అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రారంభించారు. అప్పట్లో 54 సర్వీసులను వివిధ ప్రాంతాలకు నడిపారు. తొలి నాళ్లలో ప్రయాణికుల నుంచి ఆదరణ లభించంతో డిపో లాభాలబాటలో నడిచింది. అయితే గత ఐదేళ్ల వైసీపీ పాలనలో ఆర్టీసీని నిర్వీర్యం చేశారు. అధికారులు, సిబ్బంది వైసీపీ నాయకులతో అంటకాగి ఇష్టారాజ్యంగా వ్యవహరించారు. రాబడితో సంబంధం లేకుండా టీడీపీకి అనుకూలమైన గ్రామాలన్న ముద్రవేసి బస్సులను రద్దు చేశారు. ప్రస్తుతం డిపో పరిధిలో కేవలం 35 సర్వీసులు మాత్రమే ఉన్నాయి.

సూళ్లూరుపేట నుంచి జిల్లా కేంద్రమైన తిరుపతికి 12 ఆర్డినరి బస్సులు, నాలుగు ఎక్స్‌ప్రెస్‌లు నడిపేవారు. మూడేళ్ల ఏళ్ల కింద ఆర్డినరి బస్సుల స్థానంలో ఎక్స్‌ప్రెస్‌లు ప్రవేశపెట్టారు. అలాగే రెండేళ్ల కిందట తిరుపతికి పది అద్దె బస్సులను ప్రారంభించగా అవి ఆరు నెలలు కూడా తిరగలేదు. వాటి స్థానంలో ప్రత్యామ్నాయ సర్వీసులు నడపకపోవడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. అదే విధంగా బాగా రాబడి వచ్చే కోట మార్గంలో గంటకు ఒక సర్వీసు ఉండేది. ఇప్పుడు బస్సు వెళ్తుందో లేదో కూడా తెలియడం లేదు. సూళ్లూరుపేట నుంచి నెల్లూరు - చెన్నై నగరాలకు ఒక బస్సు కూడా లేకపోవడం శోచనీయం. అదే చెన్నై నుంచి నాయుడుపేట, నెల్లూరు వైపు తమిళనాడు బస్సులు పరుగులు తీస్తున్నాయి. శ్రీహరికోట - బెంగళూరు మధ్య కర్ణాటక ఆర్టీసీ రెండు ఐరావతి సర్వీసులను క్రమం తప్పకుండా నడుపుతోంది. అదే విధంగా సూళ్లూరుపేట నుంచి హైదరాబాద్, బెంగళూరు, కడప, శ్రీశైలం, మదనపల్లి, విజయవాడ, తిరుమలకు నడిస్తున్న బస్సులను పూర్తిగా రద్దు చేశారు. బస్సులు కావాలని విన్నపాలు ఉన్న పట్టించుకోలేదు.


సూళ్లూరుపేట ఆర్టీసీ డిపో గ్యారేజ్

సూళ్లూరుపేట నుంచి ఉచ్చూరు, కట్టువపల్లి, తుంగమడుగు, కారూరు, వాటంబేడు, ఎస్ఎం కండ్రిగ, కారిపాకం, సుగ్గుపల్లి, రామాపురం, శ్రీహరికోట తదితర గ్రామీణ ప్రాంతాలకు బస్సులు తిరుగుతున్నట్లు అధికారులు రికార్డులో చూపుతూ ఆ సర్వీసులు ఇతర ప్రాంతాలకు నడుపుతున్నారు.

కలెక్టర్ ఆదేశాలకూ దిక్కులేదు

ప్రభుత్వం మారాక డిపో బాగుపడుతుందని అందరూ భావించారు. అయితే అధికారులు, సిబ్బంది వ్యవహార శైలి మారలేదు. మూడు నెలల కిత్రం జిల్లా కలెక్టర్ మంగళంపాడు గ్రామానికి బస్సు నడపాలని ఆదేశాలిచ్చిన పట్టించుకోలేదు. ఇటీవల మాజీ మంత్రి పరసారత్నం తమ స్వగ్రామమైన గొట్టిప్రోలుకు బస్సు నడపాలని ఆర్టీసీ అధికారులను కోరినా ఫలితంలేదు. ఒక మాజీ మంత్రి, జిల్లా కలెక్టర్ మాటలకే దిక్కులేకపోతే సామాన్య ప్రజలకు డిపో అధికారులు ఏమి సమాధానం చెబుతారో ఇట్టే తెలుస్తోంది. ఇదిలా ఉండగా కొందరు సిబ్బంది తమ విధులను పక్కన బెట్టి సూపర్‌వైజర్లు, అధికారులుగా చెలామణి అవుతున్నారు. తరచూ బస్సులు రద్దు చేయడం పరిపాటిగా మారిపోయింది. కొన్ని సర్వీసులు షెడ్యూల్ ఒక మార్గం అయితే నడిపేది మరో మార్గంలో నడపుతున్నారు. ఈ విషయం తెలిసిన ఉన్నతాధికారులు తమకేమి పట్టనట్లు ఉంటున్నారు. డిపోలో లోపాలను గుర్తించి ఎప్పటికప్పుడు చర్యలు చేపట్టాల్సిన విజిలెన్స్ విభాగం నిద్రపోతుందనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా ఆర్టీసీ ఉన్నతాధికారులు దృష్టిసారించి సూళ్లూరుపేట డిపో పూర్వ వైభవానికి చర్యలు తీసుకుకోవాల్సిన అవసరం ఉంది.

నాడు మంచినీటి కోనేరు... నేడు మురికి గుంట


గుర్రపు డెక్క, మురుగునీటితో నిండిపోయిన కోనేరు

తడ, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): తడ మండల పరిధిలో చెన్నై - కోల్‌కతా రహదారికి ఆనుకొని తడకండ్రిగ సర్వే నెంబరు 121లో సుమారు మూడన్నర ఎకరాల విస్తీర్ణంలో ఉన్న కోనేరు ఇది. దశాబ్దాల చరిత్ర కలిగిన ఈ కోనేరు మద్రాసు నుంచి నెల్లూరు వైపు వెళ్లే పాదచారులు, వాహనదారులు, గుర్రపు బండ్లలో వెళ్లేవారి దాహార్తి తీర్చేది. కాలక్రమంలో ఆక్రమణలకు గురవడంతో రెండెకరాలకు కుచించుకుపోయింది. చుట్టూ నివాస గృహాల్లోని వ్యర్థపునీరు చేరడంతో మురికి గుంటగా మారిపోయింది. కోనేరంతా గుర్రపు డెక్క, మురుగునీటితో నిండిపోయి దుర్గంధం వెదజల్లుతోంది.

వైభవంగా సీతారాముల కల్యాణం


సీతారాముల కల్యాణం నిర్వహిస్తున్న వేదపండితులు

గూడూరు, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): స్థానిక వివేకానంద రోడ్డులోని శ్రీరామ మందిరంలో బుధవారం ముఠా వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో సీతారాముల కల్యాణం నిర్వహించారు. స్వామి, అమ్మవార్లను ప్రత్యేకంగా అలంకరించి వేదపండితుల మంత్రోచ్చారణల నడుమ వైభవోపేతంగా కల్యాణ మహోత్సవం జరిపారు. అనంతరం అన్నదానం చేశారు. గార బాబు రావు, సరస్వతి, జయరావు, రమ్యకృష్ణ కుటుంబసభ్యులు ఉభయదాతలుగా వ్యవహరించారు.

జాతీయ స్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలకు శైలజ


శైలజను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ శంకర్ శర్మ, అధ్యాపకులు

సూళ్లూరుపేట, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): ఆల్ ఇండియా ఇంటర్ యూనివర్సిటీ టోర్నమెంట్ సాఫ్ట్‌బాల్ మహిళా జట్టుకు సూళ్లూరుపేట వీఎస్ఎస్‌సీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బీకాం ప్రథమ సంవత్సరం చదివే పి.శైలజ ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ ఎల్ఎల్‌బీ శంకర్ శర్మ తెలిపారు. ఈ నెల 30 నుంచి మే 3వ తేదీ వరకు నెల్లూరులోని విక్రమ సింహపురి యూనివర్సిటీ జరిగే టోర్నమెంట్‌లో విద్యార్థిని పాల్గొననున్నట్లు చెప్పారు. బుధవారం శైలజను ప్రిన్సిపాల్, ఫిజికల్ డైరెక్టర్ అమ్మాజీ, అధ్యాపకులు అభినందించారు.

అంచనాల కమిటీ సమావేశంలో పాశిం



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్

గూడూరు, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): చిత్తూరులోని జిల్లా పరిషత్ కార్యాలయంలో బుధవారం జరిగిన అసెంబ్లీ అంచనాల కమిటీ సమావేశంలో ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్ పాల్గొన్నారు. న్నట్లు అంచనాల కమిటీ సభ్యుడు, ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్ తెలిపారు. చైర్మన్ జోగేశ్వరరావు ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశంలో జిల్లాలో జరిగిన పనులు, ఖర్చుపెట్టిన నిధుల గురించి శాఖల వారీగా సమీక్షించారు.

వీవోఏను కొనసాగించాలని ఆందోళన

బాలాయపల్లి, ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి) మండలంలోని సిద్దాగుంట వీవోఏ నిడిగింటి విజయమ్మను కొనసాగించాలని ఆ గ్రామానికి చెందిన పొదుపు సంఘాల సభ్యులు బుధవారం వెలుగు కార్యాలయం వద్ద ఆందోళన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వీవోఏ విజయమ్మ తన విధులను సక్రమంగా నిర్వహిస్తోందని, అయితే కొందరు రాజకీయ నాయకులు ఆమెను తొలగించేందుకు చూస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఉన్నతాదికారులు స్పందించి విజయమ్మను కొనసాగించాలని కోరారు. కార్యక్రమంలో సంఘ బంధం అధ్యక్షురాలు నిడిగింటి సుగుణ, శారదమ్మ, సుధా, చెంచమ్మ, సరస్వతి, వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుడికి ప్రతిభా పురస్కారం


ఉపాధ్యాయుడు అజీబాబురావును అభినందిస్తున్న ఎంఈవో కాంచన

గూడూరు, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): స్థానిక భవిత కేంద్రంలో ప్రత్యేక అవసరాలు కలిగిన విద్యార్థులకు బోధించే సహిత విద్యా ఉపాధ్యాయుడు అజీబాబురావు అంబేడ్కర్ జాతీయ ప్రతిభా పురస్కారాన్ని అందుకున్నారు. బుధవారం ఆయనను ఎంఈవో కాంచన అభినందించారు. ఈ సందర్భంగా ఎంఈవో మాట్లాడుతూ అంబేడ్కర్ జయంతి సందర్భంగా గుంటూరులోని ఆంధ్ర క్రైస్తవ కళాశాలలో జరిగిన కార్యక్రమంలో సదరన్ ప్రైవేట్ లెక్చరర్స్ టీచర్స్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో అజీబాబురావు అవార్డు అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు ఉన్నత స్థాయికి ఎదగాలి

గూడూరు అర్బన్, ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు చదువుల్లో శ్రద్ధ చూపి భవిష్యత్తులో ఉన్నత స్థానాలకు ఎదగాలని శ్రీకృష్ణసేవా సమితి అధ్యక్షుడు మయూరి శ్యామ్‌యాదవ్ అన్నారు. బుధవారం పాఠశాలలో ఐఐటీ ఒలంపియాడ్ పరీక్షల్లో ప్రతిభచాటిన విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు చిన్నతనం నుంచే లక్ష్యాలను ఎంచుకుని కష్టపడి చదివి సాధించుకోవాలన్నారు. కార్యక్రమంలో కడివేటి చంద్రశేఖర్, శివ కుమార్‌రెడ్డి, శ్రీహరి తదితరులు పాల్గొన్నారు.



స్వామి, అమ్మవార్లకు చక్రస్నానం నిర్వహిస్తున్న అర్చకులు - పుష్కరిణిలో వసంతోత్సవం నిర్వహిస్తున్న భక్తులు

వైభవంగా కోదండ రామాంజనేయస్వామి వసంతోత్సవం

గూడూరు, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): స్థానిక కోనేటిమిట్టలోని కోదండ రామాంజనేయస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం స్వామి, అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం విశ్వక్సేన ప్రార్థన, మహాలక్ష్మీ హోమం, బలిహరణ పూజలు జరిపారు. అనంతరం స్వామి, అమ్మవార్ల ఉత్సవ విగ్రహాలకు పుష్కరిణిలో వైభవంగా వసంతోత్సవం నిర్వహించారు. అనంతరం ఉత్సవ విగ్రహాలకు వేదపండితుల మంత్రోచ్చరణల నడుమ చక్రస్నానం పూజలు జరిపారు. రాత్రి ధ్వజావరోహణం నిర్వహించారు. ననిమేలు చంద్రశేఖరయ్య, వాణి, కృష్ణారావు, ఉమాదేవి కుటుంబసభ్యులు ఉభయదాతలుగా వ్యవహరించారు.

అగ్నిప్రమాదాల నివారణకు జాగ్రత్తలు తీసుకోవాలి

గూడూరు, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): అగ్నిప్రమాదాలు జరగకుండా ప్రజలు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని అగ్నిమాపకశాఖ అధికారి విజయ్‌కుమార్ అన్నారు. బుధవారం గూడూరు రైల్వేస్టేషన్ ఆవరణలో అగ్నిప్రమాదాల నివారణపై డెమో నిర్వహించి అవగాహన కల్పించారు. వేసవిలో అగ్నిప్రమాదాలు ఎక్కువగా జరిగే అస్కారం ఉంటుందని, ప్రజలు జాగ్రత్తలు చేపడితే ప్రమాదాలను నివారించవచ్చునన్నారు. కార్యక్రమంలో అంజినాయుడు, ప్రదీప్, శ్రీనివాసులు, సంపత్ తదితరులు పాల్గొన్నారు.

కోట: మండల పరిధిలోని విద్యానగర్‌లోని పలు అపార్ట్‌మెంట్లలో అగ్నిమాపక వారోత్సవాలు జరిగాయి. అగ్నిప్రమాదాలు జరిగినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలను ప్రయోగాత్మకంగా వివరించారు. కార్యక్రమంలో అగ్నిమాపక అధికారి హరిష్, సిబ్బంది వినయ్, నరసింహం, శ్రీహరి, సునీల్, దుర్గాప్రసాద్, దేశయ్య పాల్గొన్నారు.

వెంకటగిరి: ఎండల వల్ల అగ్ని ప్రమాదాలు జరిగే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అగ్నిమాపక అధికారి నారాయణ ప్రజలకు సూచించారు. అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా పట్టణంలోని పలు అపార్ట్‌మెంట్లలో అగ్ని ప్రమాదాలు జరిగినప్పుడు ఎలా వ్యవహరించాలో అవగాహన కల్పించారు.


అగ్నిప్రమాదాలపై అవగాహన కల్పిస్తున్న సిబ్బంది

ఆటోను ఢీకొన్న ప్రైవేటు బస్సు

నలుగురికి గాయాలు

నాయుడుపేట టౌన్, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పుదూరు సమీపంలో ఆటోను ఓ ప్రైవేటు బస్సు ఢీకొన్న సంఘటనలో నలుగురు గాయపడ్డారు. బుధవారం మల్లాం నుంచి నాయుడుపేటకు వెళ్తున్న ఆటోను ఎదురుగా వచ్చిన ఓ ప్రైవేటు బస్సు ఢీకొంది. ఈ ప్రమాదంలో ఆటోలో ప్రయాణిస్తున్న రమణయ్యతో పాటు మరో ముగ్గిరికి స్వల్ప గాయాలయ్యాయి. క్షతగాత్రులను 108 వాహనంలో నాయుడుపేట ప్రభుత్వాస్పత్రికి తరలించి చికిత్స అందించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

కేశవరంలో పోషణ్ పక్వాడ


తల్లులకు అవగాహన కల్పిస్తున్న సూపర్‌వైజర్ కవిత

కోట, ఏప్రిల్ 16: మండల పరిధిలోని కేశవరం అంగన్‌వాడీ కేంద్రంలో బుధవారం పోషణ్ పక్వాడ కార్యక్రమం నిర్వహించారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ కవిత ఆధ్వర్యంలో తల్లులకు వెయ్యి రోజుల సంరక్షణ గురించి అవగాహన కల్పించారు. పౌష్టికాహార ప్రాముఖ్యతను వివరించారు. తల్లులు, గర్భిణులు ఇంటి వద్దే పోషకాహారాన్ని తయారు చేసుకునే విధానాన్ని తెలియజేశారు.

దళితుల సంక్షేమానికి ప్రభుత్వం కృషి

గూడూరు, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): దళితుల సంక్షేమానికి ప్రభుత్వం కృషి చేస్తోందని ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్ అన్నారు. బుధవారం ఆయన మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణకు క్యాబినెట్ ఆమోదం తెలపడం హర్షణీయమన్నారు. త్వరలో విడుదల చేయనున్న డీఎస్సీ నోటిఫికేషన్, ఇతర ఉద్యోగాల్లో రిజర్వేషన్లు సమానంగా అందేలా కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకోనుందన్నారు.

వసంతోత్సవాలు

వెంకటగిరి టౌన్, ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని తోలిమిట్టలో శ్రీరామ నవమి ఉత్సవాల్లో భాగంగా బుధవారం వసంతోత్సవాలు నిర్వహించారు. పిల్లలు, పెద్దలు ఉట్టి కొట్టి సంబరాలు జరుపుకున్నారు. సాయంత్రం స్వామివారికి ఉభయాలు నిర్వహించి గుగ్గిళ్ల పంపిణీ చేశారు.


ఉట్టి కొడుతున్న చిన్నారులు

కుదిరిలో రీ సర్వేపై గ్రామసభ

సూళ్లూరుపేట, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని కుదిరి గ్రామంలో బుధవారం రీ సర్వేపై తహసీల్దార్ నరసింహరావు ఆధ్వర్యంలో గ్రామసభ నిర్వహించారు. కుదిరి, తిప్పకండ్రిగ గ్రామాల్లో వచ్చే వారం పైలెట్ ప్రాజెక్టు కింద రీసర్వే ప్రారంభించనున్నట్లు తహసీల్దార్ తెలిపారు. కార్యక్రమంలో వీఆర్వోలు శ్రీదేవి, నీలిమ, హైమావతి, సర్వేయర్లు బాలాజి, సతీష్, రాము తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ కార్మికుల ధర్నా

వెంకటగిరి, ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి): తమ సమస్యల పరిష్కారం కోసం కార్మికులు బుధవారం సీఐటీయూ ఆధ్వర్యంలో మున్సిపల్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహిం చారు. ఈ సందర్భంగా వడ్డిపల్లి చెంగయ్య మాట్లాడుతూ మున్సిపాలిటీలో పనిచేస్తున్న ఇంజనీరింగ్, చెత్త వాహనాల డ్రైవర్లకు జీవో నెంబర్ 36 ప్రకారం వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. పెంచలయ్య, ప్రసాద్, సుబ్రహ్మ ణ్యం, మని, నాగరాజు, కృష్ణమ్మ పాల్గొన్నారు.

టీడీపీలో చేరిన వైసీపీ నేతలు

నాయుడుపేట టౌన్, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): నాయుడుపేట పట్టణానికి చెందిన పొట్టపూడి రాజేష్, గురుమూర్తి, సురేష్, తడ మండలానికి చెందిన కొందరు వైసీపీ నేతలు టీడీపీలో చేరారు. బుధవారం రాత్రి రేణిగుంట నుంచి నెల్లూరు వెళ్తున్న మంత్రి ఆనం రామనారాయణరెడ్డికి నాయుడుపేటలో మాజీ ఎంపీ నెలవల ఆధ్వర్యంలో టీడీపీ నాయకులు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా మంత్రి సమక్షంలో వైసీపీ నాయకులు టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు.

చదువులతోనే ఉజ్వల భవిత

గూడూరు, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): చదువుతోనే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని శ్రీచైతన్య పాఠశాల ప్రిన్సిపాల్ శ్రీనివాసులు అన్నారు. బుధవారం పాఠశాలలో వివిధ తరగతులలో ప్రతిభచాటిన విద్యార్థులకు ప్రశంసా సర్టిఫికెట్లు అందజేశారు.

ప్రజా సమస్యలను సత్వరం పరిష్కరించాలి

గూడూరు, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): ప్రజలు అందజేసే అర్జీలకు త్వరితగతిన పరిష్కారం చూపాలని తిరుపతి ఇరిగేషన్ డీఈ మురళి అన్నారు. బుధవారం గూడూరు మండల పరిషత్ కార్యాలయంలో డివిజన్ పరిధిలోని ఇరిగేషన్ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా విజ్ఞప్తుల దినంలో ప్రజలు అందజేసే వినతులకు సకాలంలో పరిష్కారం చూపాలన్నారు. విధినిర్వహణలో అలసత్వం వహిస్తే శాఖాపరమైన చర్యలు చేపట్టడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఇరిగేషన్‌శాఖ ఈఈ శ్రీనివాస రావు, తెలుగుగంగ ఈఈ శ్రీనివాసరావు, ఏఈ కల్పన పాల్గొన్నారు.

రూ.1.12 కోట్ల విలువైన 510 సెల్‌ఫోన్ల రికవరీ

తిరుపతి(నేరవిభాగం), ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి): మూడు నెలల వ్యవధిలో మొబైల్ హంట్, సీఇఐఆర్ పోర్టల్ ద్వారా రూ.1.12 కోట్ల విలువైన 510 సెల్‌ఫోన్లను పోలీసులు రికవరీ చేశారు. పోలీసు పెరేడ్ గ్రౌండ్‌లో ఆ వివరాలను బుధవారం ఎస్పీ హర్షవర్ధన రాజు మీడియాకు వెల్లడించారు. సెల్‌ఫోన్ చోరీకి గురైన వెంటనే మొబైల్ హంట్ వాట్సాప్ 9490617873 ద్వారా సీఇఐఆర్ పోర్టల్‌కు సమాచారమివ్వాలన్నారు. సెల్‌ఫోన్ల రికవరీలో జిల్లా ప్రథమ స్థానంలో ఉందన్నారు. ఇప్పటివరకు 12 విడతల్లో రూ.7.56 కోట్ల విలువచేసే 4,275 ఫోన్లు రికవరీ చేసి బాధితులకు అందజేసినట్లు చెప్పారు. ఎవరైనా కొత్త వ్యక్తులు సెల్‌ఫోన్లు అమ్మడానికి వస్తే దుకాణదారులు బిల్లులు పరిశీలించాలని సూచించారు. అనంతరం సెల్‌ఫోన్ల రికవరీలో ప్రతిభ కనబరచిన సైబర్ క్రైం సీఐ వినోద్‌కుమార్, సిబ్బందిని ఎస్పీ అభినందించి ప్రశంసాపత్రాలు అందజేశారు.

ఎన్‌బీకేఆర్‌తో జపాన్ కంపెనీ ఒప్పందం



సమావేశంలో మాట్లాడుతున్న మెడిన్‌షా కంపెనీ ప్రతినిధి

కోట, ఏప్రిల్ 16: మండల పరిధిలోని విద్యానగర్ ఎన్‌బీకేఆర్ ఇంజనీరింగ్ కళాశాలను జపాన్‌కు చెందిన మెడిన్‌షా కార్పొరేషన్ కంపెనీ ప్రతినిధులు సందర్శించారు. 2018 నుంచి ఎన్‌బీకేఆర్ ఇంజనీరింగ్ కళాశాల మెడిన్‌షా కార్పొరేషన్ కంపెనీతో పలు అవగాహన ఒప్పందాలు కుదుర్చుకుంది. తాజాగా టెక్నికల్ ట్రైనింగ్, ఇంటర్న్‌షిప్, ప్రాంగణ ఎంపికలు నిర్వహించేందుకు అవగాహన కుదుర్చుకున్నారు. కంపెనీ ప్లాంట్ హెడ్ రమేష్ చంద్రాసింగ్, చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ వినయ్ సిప్లా, ఆపరేషన్ డైరెక్టర్ టెకాయకి సానోసాన్, మునుపటి ఎండీ యమమోటో, ప్రస్తుత ఎండీ వకుయాలు కళాశాలను సందర్శించి విద్యార్థులు, అధ్యాపకులతో చర్చించారు. నాయుడుపేట మండలం మేనకూరు ప్లాంట్ ఎండీ వకుయా మాట్లాడుతూ అహ్మదాబాద్ - ఢిల్లీ బుల్లెట్ ట్రైన్ ఆర్డర్ తమకే లభించిందని, తద్వారా రాబోయే ఐదు సంవత్సరాల్లో మెకానికల్, ఎలక్ట్రికల్ విద్యార్థులకు మరిన్ని ఉపాధి అవకాశాలు ఉన్నట్లు పేర్కొన్నారు. మూడవ సంవత్సరం మెకానికల్, ఎలక్ట్రికల్ చదువుతున్న విద్యార్థులకు మెడిన్‌షా కార్పొరేషన్ కంపెనీ ఆధ్వర్యంలో ట్రైనింగ్ ఇచ్చి ప్రాంగణ ఎంపికలు నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ డాక్టర్ విజయ్‌కుమార్‌రెడ్డి, ప్రాంగణ ఎంపికల అధికారి డాక్టర్ ఎన్ కిషిందర్, ఆయా విభాగాధిపతులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి

దాతల సహకారం అభినందనీయం


కళావేదిక ప్రారంభిస్తున్న ముఖ్యఅతిథులు

పెళ్లకూరు, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి దాతల సహకారం అభినందనీయమని టీడీపీ సీనియర్ నాయకులు పేరం రమేష్ నాయుడు, మధునాయుడు అన్నారు. పెళ్లకూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నూతనంగా నిర్మించిన కళా వేదికను వారు బుధవారం ప్రారంభించారు. పెన్నేపల్లి గ్రామానికి చెందిన మాజీ సర్పంచు గాలి రమేష్ నాయుడు తన తల్లిదండ్రులు గాలి మాధవనాయుడు, రాధమ్మ జ్ఞాపకార్థం రూ.3 లక్షల వ్యయంతో కళావేదికను నిర్మించి ఇచ్చారు. ఈ కళావేదిక ప్రారంభోత్సవానికి ముఖ్య అతిథులుగా విచ్చేసిన పేరం సోదరులు మాట్లాడుతూ విద్యాభివృద్ధికి గాలి రమేష్‌నాయుడు, జయప్రద దంపతులు ముందుకు రావడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. వీరిని ఆదర్శంగా తీసుకుని పాఠశాలల బలోపేతానికి దాతలు కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు శెట్టిపల్లి మునిశేఖర్, ఉపాధ్యాయులు సుబ్రహ్మణ్యం, స్వర్ణలత, చెంగయ్య, నాయకులు గాలి రాజేష్, హరినాయుడు పాల్గొన్నారు.

ముగిసిన సంగమేశ్వరుడి బ్రహ్మోత్సవాలు

కోట, ఏప్రిల్ 16: మండల పరిధిలోని గూడలిలో వెలసిన కామాక్షీదేవి సమేత సంగమేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు బుధవారం తెల్లవారుజామున ఏకాంత సేవతో ముగిశాయి. స్వామి, అమ్మవార్లకు మంగళవారం రాత్రి నుంచే పల్లకిసేవ నిర్వహించారు. బుధవారం తెల్లవారుజామున ఏకాంత సేవ జరిపారు.

ఒలంపియాడ్ పరీక్షల్లో విద్యార్థుల ప్రతిభ

గూడూరు అర్బన్, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): ఐఐటీ ఒలంపియాడ్ పరీక్షల్లో ప్రతిభ చాటిన స్థానిక మినర్వా పాఠశాలలో విద్యార్థులను బుధవారం అభినందించారు. ఈ సందర్భంగా పాఠశాల సిబ్బంది మాట్లాడుతూ తమ పాఠశాలకు చెందిన 17 విద్యార్థులు ఒలంపి యాడ్ పరీక్షల్లో ప్రతిభచాటడం జరిగిందన్నారు. కార్యక్రమంలో వినోద్‌కుమార్, రాము తదితరులు పాల్గొన్నారు.